సహజీవన భావనల పావురాయి

# గీటురాయి


వారపత్రిక 29-12-2023 15/-





# బహుజనహితాయ




ధర్మంలో కొత్త పోకడ
బిద్అత్

గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 52 హైదరాబాద్
శుక్రవారం 29 డిసెంబర్ 2023 రూ.15-00
15 జమాదిఉల్ ఆఖిర్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

**అల్లాహ్ ఇలా సెలవిచ్చినట్లు ముహమ్మద్ (స) తెలిపారు: "నీవు దైవమార్గంలో ధనం ఖర్చు చెయ్యి. నేను నీకై ధనం ఖర్చు చేస్తాను."**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




**సృష్టికర్త వైపునకు మరలండి**

## లోపల...

| | | |
|---|---|---|
| విపక్ష ముక్త సంసద్ | ...... | 04 |
| బహుజనహితాయ | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)–11 | ...... | 08 |
| కొత్త ప్రభుత్వం చేయాల్సినవి | ...... | 10 |
| గతానికి వీడ్కోలు! నూతనత్వానికి స్వాగతం | ...... | 12 |
| ధర్మంలో కొత్త పోకడ బిద్అత్ | ...... | 14 |
| వ్యక్తిత్వం | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అరబ్బుల ప్రత్యేకతలు–2 | ...... | 23 |
| చరితార్థులు–2 : నవాబ్ అలీ బహదూర్ | ...... | 25 |
| ఒక హిందువు ఆవేదన | ...... | 26 |
| ఇస్లాం అంటే... | ...... | 28 |
| యుద్ధం అనర్థదాయకం | ...... | 30 |

**ఇక్కడెవరూ నోరుతెరవద్దు...**



వందమంది ఎంపీల్ని
గెంటారట బయటికి
గొంతెత్తడమే పాపం
పంపారట యింటికి!
ప్రశ్నించే గొంతుకలకు
చోటు లేదు యిక్కడ
ప్రజాస్వామ్య ద్రోహం
జరుగుతోంది అక్కడ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# విపక్ష్ ముక్త్ సంసద్

**డిసెంబర్ 13వ తేదీన** కొంతమంది పార్లమెంటులో పొగబాంబులతో ప్రవేశించారు. ఆ పొగ ప్రమాదకరమేమీ కాదు కాబట్టి పెద్ద ప్రమాదం తప్పింది. కాని పార్లమెంటులోకి పొగబాంబులతో కొందరు ప్రవేశించడం పార్లమెంటు భద్రత వ్యవస్థ పట్ల ప్రశ్నార్థకమయ్యింది. పైగా ఈ పొగబాంబు దుండగులకు పార్లమెంటులో ప్రవేశించే పాసులు ఇచ్చింది బీజేపీ ఎం.పీ. ప్రతాప్ సిన్హా. పార్లమెంటు భద్రతావ్యవస్థ పట్ల తీవ్రమైన ప్రశ్నలు సంధిస్తున్న ఈ సంఘటన పట్ల రాజ్యసభ చైర్మన్, లోక్ సభ స్పీకర్ ఎలా ప్రతిస్పందిస్తారని మనం ఆశిస్తాం. ఇలాంటి దుండగులకు పాసులు ఇచ్చిన సభ్యుడిని ముందు సస్పెండ్ చేస్తారని, లోక్‌సభ, రాజ్యసభల్లో హెూంమంత్రి వచ్చి ఈ సంఘటన గురించి వివరణ ఇచ్చేలా చేస్తారని ఆశిస్తాం. కాని అలా జరగలేదు. లోక్ సభ, రాజ్యసభల నుంచి 141 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. ఎందుకు సస్పెండ్ చేశారంటే, పార్లమెంటుపై దాడి పట్ల ఈ ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హెూంమంత్రి వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ అయ్యారు. ఇప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యుల సంఖ్య దాదాపు 70 శాతం తగ్గిపోయింది. ఈ లోగా ప్రభుత్వం ముఖ్యమైన బిల్లులు ప్రవేశపెట్టింది. ఈ సంఘటనలు నమ్మశక్యంగా ఉన్నాయా? ఒక ప్రజాస్వామ్య దేశంలో ఇలా జరుగుతుందని ఏదన్నా సినిమాలో చూపించినా నమ్మలేని సంఘటనలివి.

పార్లమెంటులో సభ్యులు నిరసన తెలియజేయడం, వెల్ లోకి వెళ్ళడం ఇండియాలో కొత్తదేమీ కాదు. బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలా సార్లు బీజేపీ సభ్యులు సభను జరక్కుండా అడ్డుకున్న ఉదాహరణలున్నాయి. సుష్మా స్వరాజ్ వంటి సీనియర్ బీజేపీ నేత గతంలో "పార్లమెంటు సమావేశాలను స్తంభించేలా చేయడం కూడా ప్రజాస్వామ్యంలో భాగమే" అన్నారు. మరో సీనియర్ నేత అరుణ్ జైట్లీ గతంలో ఏమన్నారంటే, "చాలా సందర్భాల్లో పార్లమెంటు కొన్ని ముఖ్యమైన సమస్యలను ఉపేక్షించడం జరగవచ్చు. అలాంటి సందర్భాల్లో పార్లమెంటును స్తంభింపజేయడం కూడా ప్రజాస్వామ్యమే" అన్నారు. కాని ఇప్పుడు నిరసనకు దిగిన సభ్యులను ఎందుకు బహిష్కరించారు? బీజేపీకి ఒక రూలు, ఇతరులకు మరో రూలా? నిరసన తెలియజేస్తున్న సభ్యులను భారీసంఖ్యలో సస్పెండ్ చేయడం భారత ప్రజాస్వామ్యంలో ఎన్నడూ జరగలేదు. భారత ప్రజాస్వామ్యంలో గతంలో ఎన్నడూ జరగని అనేక సంఘటనలు ఇప్పుడు జరుగుతున్నాయన్నది కూడా వాస్తవమే.

ఎందుకు ఇంతమందిని సస్పెండ్ చేశారు? ఈ ప్రశ్నకు చాలా సులభమైన సమాధానం, ప్రభుత్వం వద్ద అధికారముంది కాబట్టి చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాల తర్వాత బీజేపీ ఇప్పుడు తనకు ఎదురు లేదని భావిస్తోంది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని అనుకుంటోంది. ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రాముఖ్యత లేదని, ప్రతిపక్షాలు చెప్పే మాటలకు విలువ లేదని నిర్ణయించుకుంది. కాబట్టి ప్రతిపక్షాలకు ప్రశ్నించే అర్హత లేదని భావిస్తోంది.

ప్రజలు ఎలా ప్రతిస్పందిస్తున్నారు? నిజం చెప్పాలంటే పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకుల పట్ల ఏవగింపు ధోరణి ప్రజల్లో ఉంది. ప్రజలు ప్రతిస్పందించరన్నది కూడా బీజేపీకి బాగా తెలుసు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల రాజకీయాలు మాత్రమే కాదు, ప్రజాస్వామ్య సంస్థలను కాపాడుకోవడం అనే అవగాహన కూడా ప్రజల్లో రానంత వరకు ఇలాంటి నిరంకుశ పోకడలకు కళ్ళెం వేయడం సాధ్యం కాదు. ✤

అబ్దుల్ వాహెద్




# బహుజనహితాయ

బహుజనసమాజ్ పార్టీ ఇటీవల వార్తల్లో ఎక్కడ కనబడడం లేదు. పార్టీ కార్యకలాపాలు కూడా పెద్దగా ఉన్నట్లు తెలియడం లేదు. గతవారం బహుజనసమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి రెండు ప్రకటనలు చేశారు. ఆ రెండు ప్రకటనలు తప్ప మరెలాంటి రాజకీయ కార్యక్రమాలు బహుజనసమాజ్ పార్టీ నుంచి కనబడడం లేదు.

ఆ రెండు ప్రకటనలు ఏవంటే, మొదటి ప్రకటన బియస్పీ పార్లమెంటు సభ్యుడు డానిష్ అలీ గురించిన ప్రకటన. డానిష్ అలీ పై పార్లమెంటులో బీజేపీ సభ్యుడు రమేష్ బిధూరి చేసిన అనుచిత వ్యాఖ్యల గురించి చాలా మంది చదివే ఉంటారు. డానిష్ అలీని మతపరంగా కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలవి. ఆ వ్యాఖ్యలు రమేష్ బిధూరీ చేసినప్పుడు బియస్పీ అధినేత్రి నుంచి డానిష్ అలీకి ఎలాంటి మద్దతు లభించలేదు. రమేష్ బిధూరికి బీజేపీ వెంటనే రాజస్థాన్ ఎన్నికల్లో కీలక బాధ్యతలు కట్టబెట్టి సన్మానించింది. ఆ డానిష్ అలీని ఇప్పుడు బియస్పీ అధినేత్రి మాయావతి పార్టీ నుంచి బహిష్కరించింది. ఎందుకు సస్పెండ్ చేశారంటే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టినందుకంట? ఆ కార్యకలాపాలేమిటో చెప్పలేదు. కాని, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రాను బహిష్కరణకు సంబంధించి డానిష్ అలీ ఇతర ప్రతిపక్ష నేతలతో వాకౌట్ చేశారు. ఆ వెంటనే మాయావతి ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. తాను బియస్పీ పార్టీ కోసం పనిచేశానని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడా ఎప్పుడు చేపట్టలేదని, తన నియోజకవర్గం ప్రజలే దానికి సాక్ష్యమిస్తారని డానిష్ అలీ ప్రకటించాడు.

డానిష్ అలీని బహిష్కరించడం ద్వారా మాయావతి మొత్తం ముస్లిం సమాజానికి ఒక సందేశాన్ని పంపించింది. బియస్పీ పార్టీలో ముస్లిములకు ఎలాంటి ప్రాముఖ్యమూ లేదని స్పష్టంగా చెబుతున్న సందేశమిది. ఉత్తరప్రదేశ్ లో ముస్లిములకు లౌకికపార్టీగా బియస్పీపై ఆశలు పెట్టుకోవడం వ్యర్థమని తెగేసి చెప్పిన నిర్ణయమిది.

లోక్‌సభ ఎథిక్స్ కమిటి తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రాను బహిష్కరించాలని చెప్పింది. ఈ కమిటీలో డానిష్ అలీ కూడా సభ్యుడు. మహువా మొయిత్రాను కమిటీలో అనుచితమైన, అమర్యాదకరమైన ప్రశ్నలు అడగడాన్ని డానిష్ అలీ అడ్డుకున్నాడు. అభ్యంతర పెట్టారు. అంతేకాదు లోక్ సభలో ఈ విషయమై

వాకౌట్ కూడా చేశారు. మహువా మొయిత్రా విషయంలో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. కాని డానిష్ అలీ తప్ప బియస్పీ సభ్యు లెవరు వాకౌట్ చేయలేదు. డానిష్ అలీ వైఖరి సహజంగానే బీజేపీకి మింగుడుపడలేదు. కాని మాయావతికి కూడా నచ్చలేదు. బీజేపీకి కోపం వచ్చేలా డానిష్ అలీ ప్రవర్తించడం ఆమెకు అస్సలు నచ్చలేదు. కాని బీజేపీ పంచన చేరితే, ఎలా అయితే కర్నాటకలో జనతాదళ్ సెక్యులర్, కుమారస్వామి నాయకత్వంలో ఇప్పుడు జై బీజేపీ అంటుందో అలా మాయావతి కూడా బీజేపీ వైపు మొగ్గు చూపితే దళిత ఓట్లు కోల్పోవచ్చు. కాబట్టి పూర్తిగా బీజేపీవైపు మొగ్గు చూపినట్లు కనిపించకుండా, లోపాయికారిగా బీజేపీకి కోపం రాకుండా రాజకీయాలు నెట్టుకువస్తున్నారు. మాయావతి బీజేపి పట్ల ఎంత సాన్నిహిత్యం కలిగి ఉన్నారన్నదో చెప్పాలంటే, ఆమె ఎంతగా ముస్లిములకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారో చూడాలి. గత ఎన్నికల్లో మాయావతి ఓటమికి కారణం ముస్లిములు ఓటు వేయక పోవడమే అన్నది ఆమె నమ్మకం. ముస్లిములు బియస్పీని వదిలి సమాజవాది పార్టీ వైపు మొగ్గు చూపడం ఆమెకు నచ్చలేదు. అలా అని ముస్లిముల కోసం ఆమె చేసింది ఏదీ లేదు. దళితుల ఓట్లు ఎలాగూ తనకు తప్పక వస్తాయని, బియస్పీ తప్ప మరే పార్టీ దళితు లకు ఇప్పుడు ప్రత్యామ్నాయం కాదని ఆమె నమ్మకం.

కాని వాస్తవమేమిటంటే, బీజేపీ రాజకీయాలను పరోక్షంగా సమర్థి స్తున్న బియస్పీకి ఇప్పుడు దళితుల్లోను అంత పట్టు ఉన్నట్లు కనిపిం చడం లేదు. దళిత ఓట్లు కూడా ఇప్పుడు బీజేపీ వైపే వెళుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో దళితుల కోసం ఆమె ఇప్పుడు గొంతు విప్పినట్లు ఎక్కడా వినపడడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో దళితుల జనాభా 20 శాతం ఉంది. ఉత్తరప్రదేశ్ దళితులు దేశంలో మిగిలిన రాష్ట్రా లన్నింటి కన్నా వెనుకబడిన సముదాయం. సియస్డియస్ సర్వే ప్రకారం 2022లో కేవలం 23 శాతం జాతవేతర దళితులు మాత్రమే బియస్పీకి ఓటు వేశారు. జాతవుల్లో తప్ప ఇతర సముదాయాల్లో బియస్పీ పలుకుబడి తగ్గిపోయింది. అంతకు ముందు 2017లో దళితుల్లో బియస్పీకి చాలా పట్టు ఉండేది. 2017లో 44 శాతం మంది బియస్పీకి ఓటు వేశారు. అంతకు ముందు 2007లో 71 శాతం మంది వాల్మీకి సముదాయం నుంచి బియస్పీకి ఓటు వేశారు. కాని 2012లో వాల్మీకి సముదాయం ఓట్లు 42 శాతానికి పడిపోయాయి. అలాగే జాతవుల ఓట్లు కూడా 2007లో 86 శాతం బియస్పీకి వచ్చాయి. కాని 2012 నాటికి 62 శాతానికి పడిపోయా యని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. అంటే బియస్పీ ఓటు బ్యాంకు క్రమేణా క్షీణిస్తోంది.

గతంలో చాలా సార్లు ముస్లిములు 50 శాతం వరకు బియస్పీకి ఓటు వేసిన చరిత్ర ఉంది. కాని బియస్పీ ముస్లిముల కోసం చేసింది ఏదీ లేదు. ముస్లిములకు బియస్పీ తప్ప మరో ప్రత్యామ్నయం ఏదీ లేదని, బియస్పీకి తప్ప మరొకరికి ఓటు వేసే పరిస్థితి లేదన్న ధీమా కూడా బియస్పీలో చాలా సార్లు కనిపించింది. అయోధ్యలో, ప్రయాగరాజ్ లో, మధురలో అగ్రవర్ణాల కోసం బియస్పీ పెద్ద పెద్ద కార్యక్రమాలు నిర్వహించింది. కాని ముస్లిముల కోసం ఒక్క కార్యక్రమం నిర్వహించిన ఉదాహరణ లేదు. ముస్లిములు బియస్పీ కోసం ఎంత చేసినా వారికి గుర్తింపు లభించడం కష్టమన్నది చాలా సార్లు రుజువయ్యింది. ఇటీవల బియస్పీ సభ్యుడు డానిష్ అలీని బిజేపీ సభ్యుడు రమేష్ బిధూరి పార్లమెంటులో అత్యంత అనుచితంగా తిట్టినప్పుడు మాయావతి మౌనమే నా భాష అని ఊరుకుంది. డానిష్ అలీ కి మద్దతుగా బియస్పీపార్టీ ముందుకు రాలేదు. బీజేపీ సభ్యుడు డానిష్ అలీపై చేసిన మతతత్వ వ్యాఖ్యలను విని విననట్లు మాయావతి మిన్నకున్నారు. డానిష్ అలీకి మద్దతుగా నిలబడే బదులు ఇప్పుడు అలీని పార్టీ నుంచి బహిష్కరించారు.

డానిష్ అలీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఒక్క ఉదాహరణ కూడా పార్టీ ఇవ్వలేదు. డానిష్ అలీని బహిష్కరించడానికి ఒకే ఒక్క కారణం, మహువా మొయిత్రాకు మద్దతుగా డానిష్ అలీ నిలబడడం. అంటే బీజేపీకి వ్యతిరేకంగా డానిష్ అలీ గొంతు విప్పడం. డానిష్ అలీకి బియస్పీ ప్రధాన కార్యదర్శి రాసిన లేఖలో ఏమన్నాడంటే, అనేకసార్లు డానిష్ అలీకి మౌఖికంగా, అంటే డానిష్ అలీతో మాట్లాడుతూ (దీనికి రుజువులు దొరకడం కష్టం) పార్టీ విధానాలకు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించవద్దని కోరారట. అయినా డానిష్ అలీ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వచ్చారట. అలా వ్యవహరించిన సంఘటనలేమిటో చెప్పలేదు.

ఇండియా కూటమికి బియస్పీపార్టీ దూరంగా ఉందన్నది అందరికీ తెలిసిన విషయమే. డానిష్ అలీ బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ను కలవడం మాయావతికి నచ్చలేదు. ఎందుకంటే, అది బీజేపీకి నచ్చే విధానం కాదు, సిద్ధాంతమూ కాదు.

డానిష్ అలీకి అమ్రోహా నియోజకవర్గంలో ఓటర్ల మద్దతు ఉంది. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కుంవర్ సింగ్ తోమర్ ను 63 వేల మెజారిటీతో ఓడించారు. బియస్పీలోకి వచ్చిన తర్వాతి నుంచి పార్టీలో మైనారిటీ నాయకుడిగా పేరు సంపాదించాడు. పార్లమెంటులో 98 శాతం హాజరు ఉన్న చురుకైన పార్లమెంటేరియన్. పార్టీ తనను బహిష్కరించడంపై డానిష్ అలీ మాట్లాడుతూ తన నియోజకవర్గం ప్రజలకు తానేమిటో తెలుసని అన్నాడు. బిజేపీ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించడమే నేరమైతే ఆ పని చేస్తూనే ఉంటానని కూడా చెప్పాడు.

అలీని బహిష్కరించడం ద్వారా బియస్పీసాధించిందేమిటి? పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్ లో పార్టీ మరింత బలహీనమవుతుంది. ఇంతకు ముందు సహరాన్ పూర్ జిల్లాకు చెందిన మరో ముస్లిం నాయకుడు ఇమ్రాన్ మసూద్ ను పార్టీ బహిష్కరించింది. డానిష్ అలీ, ఇమ్రాన్ మసూద్ ఇద్దరు ఇప్పుడు కాంగ్రెసుకు దగ్గరయ్యే అవకాశాలున్నాయి. వీరిద్దరు ఇండియా కూటమి పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. సమాజవాది

పార్టీ కూడా ఈ ఇద్దరిని తనవైపు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉంది.

కాని ప్రతిపక్షాల్లో అనైక్యత కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు నిజం చెప్పాలంటే ముస్లిములకు, దళితులకు ఆసరగా నిలబడే పార్టీ ఏదీ కనిపించడం లేదు. కాంగ్రెసు, సమాజవాది పార్టీలు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి పోటీ ఇచ్చే స్థాయిలో ఉన్నాయా అంటే అనుమానమే. ఉత్తర ప్రదేశ్‌లో దళిత, ముస్లిం ఓట్లు మొత్తం 38.5 శాతం ఉంటాయి. కాని కాంగ్రెసు, సమాజవాది పార్టీల అనైక్యత ఈ ఓట్లను చీలిపోయేలా చేస్తోంది. ఇటీవల మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెసును ముంచిన కాంగ్రెసు నాయకుడు కమల్‌నాథ్ సమాజవాది నాయకుడు అఖిలేష్ యాదవ్ గురించి అనుచితంగా మాట్లాడడం, దానికి తగ్గట్టుగా అఖిలేష్ యాదవ్ ప్రతిస్పందించడం అందరికీ తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజవాది పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదురుతుందా అంటే అనుమానమే. బియస్పీ ప్రస్తుతం బీజేపీకి విరుద్ధంగా ఏదీ చేయని స్థితిలో కనిపిస్తోంది. ఏ కూటమిలోను చేరేది లేదని మాయావతి చెప్పేసింది. కాబట్టి 2024 ఎన్నికల్లో మాయావతి ఉత్తరప్రదేశ్‌లో అన్ని చోట్ల పోటీ చేయవచ్చు. అంటే బిజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చవచ్చు.

దశాబ్దాల క్రితం బహుజనసమాజ్ పార్టీని స్థాపించిన కాన్షీరామ్ కేవలం దళితుల కోసం రాజకీయాలు నడిపారు. 1995లో మాయావతి బియస్పీ అధినేత్రిగా ఇతర వెనుకబడిన వర్గాలను కూడా కలుపుకున్నారు. 1993లో సమాజవాది పార్టీలో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసి విజయాలు సాధించారు. కాని రాజకీయ స్వార్థాలతో ఈ పొత్తు కథ కంచికి వెళ్ళింది. ఆ తర్వాత బిజేపీతో పొత్తు పెట్టుకుని బియస్పీ అధికారం సంపాదించగలిగింది కాని ఆ తర్వాత బీజేపీ బలపడడానికి ఈ పొత్తే ఉపయోగపడింది. బియస్పీ బలహీనం కావడానికి కారణం కూడా ఇదే.

మాయావతి చేసిన రెండవ ప్రకటన తన మేనల్లుడు ఆనంద్‌ను పార్టీలో వారసుడిగా ప్రకటించడం. ఆనంద్ ను వారసుడిగా ప్రకటించి వారసత్వ రాజకీయాలకు బియస్పీ దూరం కాదని నిరూపించేశారు. మరోవైపు బియస్పీకి పోటీగా భీంఆర్మీ పెట్టి చంద్రశేఖర్ ఆజాద్ రాజకీయాల్లో ఎదగడానికి ప్రయత్నిస్తున్నారు. కాని ఆయన ప్రయత్నాలు ఫలించడానికి ఇంకాచాలా సమయం పట్టవచ్చు. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో దళితశక్తిని ప్రదర్శించిన బియస్పీ కాన్షీరాం కాలం నుంచి నేడు మాయావతి కాలం వచ్చేసరికి రాజకీయంగా పతనావస్థకు చేరుకోవడం శోచనీయం. ముస్లిం ఓట్లే కాదు, వెనుకబడిన వర్గాల ఓట్లు, దళితుల ఓట్లు కూడా పార్టీ కోల్పోతోంది. మరోవైపు ఆనంద్ వంటి అనుభవంలేని వ్యక్తి పార్టీని నిలబెడతాడని నమ్మే పరిస్థితులు లేవు. చంద్రశేఖర్ ఆజాద్ భీం ఆర్మీ ఉత్తరప్రదేశ్ లో దళిత రాజకీయాలకు కొత్త ప్రాణం పోస్తుందా? వేచి చూడాలి. ✤

## నమ్మినా నమ్మకపోయినా ? 15

### హద్దు మీరితే కష్టాలు తప్పవు

అంతరిక్షంలోని ప్రతీ గ్రహం తన నిర్దేశిత కక్ష్యలో తిరుగాడుతోంది. దాని పరిధిలో అది పరిభ్రమిస్తుంది కాబట్టే ఇతర గ్రహాలు ఒకదాని కొకటి ఢీ కొనకుండా వుంటున్నాయి. ఫలితంగా మనం నివసిస్తున్న భూగోళ గ్రహంలో ఎలాంటి విపత్కర పరిణామాలు సంభవించక మన జీవనం సజావుగా సాగిపోతోంది.

సృష్టికర్త ఈ గ్రహాల మధ్య విధించిన సంపూర్ణ సంతులన గురుత్వాకర్షణ విధానం వల్లనే అవి ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, పరస్పరం ఘర్షించుకోకుండా పరిభ్రమించి మన జీవనానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి.

అదే విధంగా ఈ ప్రపంచంలో పరస్పర విరుద్ధ లక్షణాలున్న ఆడ, మగ సృష్టితాలున్నాయి. శారీరకంగా, మానసికంగా, హావభావాలు, భావోద్రేకాల రీత్యా పరస్పరం వీరి మధ్య వైరుధ్యముంది. వారి పరస్పర బాధ్యతలు, హక్కులు వేర్వేరుగా వున్నాయి. అయినా దాంపత్యమనే కక్ష్యలో వీరు ఎవరి పాత్రను వారు పోషిస్తున్నారు. కాబట్టే తరతరాల నుంచి మానవుల దాంపత్య జీవితం ఎలాంటి తడబాటు లేకుండా సాగుతూ వస్తోంది. అంతరిక్షంలోని గ్రహరాశులను, భూగ్రహంలోని గృహ వాసులను (అంటే మానవులను) సృష్టించిన ఆ సర్వజ్ఞాని, పరమ కరుణానుగ్రహాల స్వామి అయిన ఆ సృష్టికర్తయే ఈ సహజసిద్ధమైన సంతులన విధానాన్ని నిర్దేశించాడు. ఈ నిర్దేశిత కుటుంబ కక్ష్యలో ఆలు మగలు తమ తమ పాత్రను సజావుగా పోషిస్తూ శాంతియుత సహజీవనం సాగిస్తున్నారు. ఒకవేళ వారు తమ కక్ష్యలను లేదా హద్దులను దాటినట్లైతే వైవాహిక జీవితం కష్టనష్టాల పాలౌతుంది.

అదేవిధంగా పటిష్టమైన కుటుంబ వ్యవస్థలో దంపతులు, సంతానం పరస్పరం తమ తమ హద్దులలో వుంటూ సృష్టికర్త నిర్దేశించిన విధివిధానాలతో నడుచుకున్నట్లయితే కుటుంబం సాఫీగా కొనసాగుతుంది. అలా కాకుండా ఎవరికి వారు హద్దుమీరి ప్రవర్తించినట్లయితే ఆ కుటుంబ వ్యవస్థ అన్ని విధాల కుంటుబడిపోతుంది.

మొత్తమ్మీద ఎక్కడైతే పరస్పరం సహాయ సహకారాల ఆవశ్యకత ఏర్పడుతుందో ఆయా స్థానాల్లో దైవిక ఆదేశాలు, నిర్దేశాలు నిర్ణయించబడి వున్నాయి.

**నమ్మినా నమ్మకపోయినా** నేడు ఛిన్నాభిన్నమవుతున్న ప్రాపంచిక వ్యవస్థలో దైవిక చట్టాలను, బోధనలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిని పాటించినప్పుడే మన జీవితాలు విజయవంతమౌతాయి.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

అధ్యాయం -4

11

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## 3. అనారోగ్యం, ఖలీఫా ప్రతిపాదన

మహనీయ అబూ బక్ర్ కుమార్తె, మహనీయ ఆయిషా (ర), ప్రకారం, "ఆ రోజు బాగా చలిగా ఉంది, ఖలీఫా అబూ బక్ర్ (ర) స్నానం చేశారు, జ్వరం పట్టుకుంది. చాలా రోజుల వరకు అదే స్థితిలో ధైర్యం చేసి మస్జిద్‌లో నమాజ్ చేయిస్తూ వచ్చారు. జ్వరం మరీ అధికమయి అసాధ్యమయినప్పుడు తన స్థానంలో నమాజ్ నాయకత్వానికి మహనీయ ఉమర్ ఫారూక్‌ని నియమించారు. జ్వరం తగ్గలేదు, రోజుకు రోజు బలహీనత పెరుగుతూ పోయింది. అప్పుడు ఆయనకు తన స్థానంలో ఎవరినయినా ఖలీఫాగా నియమించాలన్న తలంపు వచ్చింది.

ఆయన ప్రప్రథమంగా సలహామండలి సభ్యులు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ని పిలిపించి మహనీయ ఉమర్‌ని గురించి మాటలాడారు. ఆయన, "నాకు ఉమర్‌ని గురించి మీ కన్నా బాగా తెలుసు, కాని ఆయన నైజంలో కాఠిన్యం అధికం" అన్నారు. దానికి అబూబక్ర్ (ర), "నాలో మార్దవం చూసి ఆయన కాఠిన్యం వహించారు. ఖిలాఫత్ బాధ్యత అప్పగించినట్లయితే నీవు ఏ కాఠిన్యం గురించి మాటలాడు తున్నావో అది దానంతట అదే తగ్గిపోతుంది" అన్నారు. ఆ తరువాత మహనీయ ఉస్మాన్ గనీని పిలిపించి, ఆయన్ని కూడా మహనీయ ఉమర్‌ని గురించి అడిగారు. ఆయన, "జనుల్ని గురించి మీరే అందరి కన్నా బాగా తెలిసిన వారు. ఉమర్‌ని గురించి కూడా నా కన్నా మీకే బాగా తెలుసు" అన్నారు. దానికి అబూ బక్ర్ "నీ అభిప్రాయం సరయినదే కావచ్చు, కాని నేను నీ అభిప్రాయం తెలుసుకోదలిచాను" అన్నారు. "ఉమర్ ఆంతర్యం ఆయన బాహ్యం కన్నా ఉత్తమమయింది. మీ తరువాత మరే వ్యక్తి కూడా ఆయనకు సమానం కాజాలడు." ఈ మహనీయులే కాక ఇతర ప్రభావ శీలురయిన సహచరుల్ని సయితం ఆయన అడిగారు. ఆ పైన ఆయన స్వయంగానూ ఆలోచించారు.

మరుసటి రోజు ఉదయం అనేక మంది మదీనా పుర ప్రముఖులు, గౌరవనీయ సహచరులూ మహనీయ అబూ బక్ర్ గదికి వెలుపల ఏకత్రయమయ్యారు. అప్పుడు ఆయన తలుపు తెరిపించి ఆ గుమికూడిన జనుల్ని సంబోధించారు:

> **"జనులారా! నేను మీ కొరకు ఒక వ్యక్తిని నా స్థానాన ఖలీఫాగా నియమించడాన్ని సమ్మతిస్తారా? దైవమే సాక్షి, నేను స్వయంగా ఆలోచించాను, అందులో ఎటువంటి కొరత రానివ్వ లేదు. ఇంకా నేను నా బంధువుని నియ మించలేదు. నేను ఖత్తాబ్ తనయుడు ఉమర్ ని ఖలీఫాగా నియమించాలని అనుకుంటున్నాను. కనుక మీరు ఆయన మాట వినండి."**

ఈ మాటలు వినగానే సమావేశంలో నుంచి నినాదాలు

వినవచ్చాయి: "మేము విన్నాము, దాన్ని శిరసావహించాము" అని. ఆ తరువాత ఆయన మహనీయ ఉమర్‌ని పిలిచారు. ఆయన సమక్షంలో ఖిలాఫత్, నిజమయిన రాజకీయాలు ఎలా నెలకొంటాయో ఆ ప్రాతిపదికలు ముందుంచారు. మరి ఇంకా ఇలా అన్నారు.

**"ఉమర్! నేను దైవ సందేశహరుల వారు (స) నెలకొల్పిన సముదాయం పైన నిన్ను నా ఉపనాయకునిగా నియమించాను. కాగా నీలో బాహ్యంలోనూ అంతర్గతంగానూ తక్వా (దైవ భీతి) నెలకొని ఉండటం అవసరం. ఉమర్! దైవంతో నీ అనుబంధాన్ని పటిష్ఠ పరచుకో, ఆయన నీ వైపునకు మ్రొగ్గుతాడు, ఆయన మ్రొగ్గిన తరువాత ఇక సాధనా సంపత్తులన్నీ స్వయంగా మొలిచే చెట్లలా మొలకెత్తుకు వస్తాయి. ఏ శక్తి పైనా ఆశలు పెట్టుకోకు, ఎందుకంటే ఏ శక్తులు పని నెరవేర్చగలవో వాటికి దైవం వద్ద నుండి అనుమతి లభించకపోతే అవి తిరగబడతాయి! పనులు చెడిపోతాయి.**

**"ఉమర్! నరక వాసుల ప్రస్తావన వచ్చినప్పుడు, 'దేవా! నన్ను వీరిలో చేర్చకు' అని వేడుకో. మరి స్వర్గవాసుల ప్రస్తావన వచ్చినప్పుడు,'దేవా! నన్ను వీరిలోనే చేర్చు' అని అర్థించు.**

**"ఉమర్! దేవుని అభీష్టం ప్రకారం నడుచుకునేందుకు నీ మనస్సును అదుపులో ఉంచుకోవడం. అత్యంతావశ్యకం. ఖత్తాబ్ తనయుడా! మనస్సు నైజం ఎటువంటిదంటే దాని కోరిక ఒకటి పూర్తి చేస్తే దాని ధైర్యం యవ్వనం దాల్చుతుంది. ఇక అది అంతకన్నా చెడు కోరికల కోసం ఇంకా బలవత్తరంగా కాళ్ళూచేతులూ కొట్టుకుంటుంది.**

**"ఉమర్! నీవు నా ఈ బోధనల్ని అమలు పరిస్తే నన్ను నీ చెంతనే కనుగొంటావు. దైవం సదాచరణలో నీకు సహాయపడు గాక!" అని ముగించారు.**

## వ్యక్తిగత వ్యవహారాలు

తన స్థానంలో నియామకం ముగిసిన తరువాత మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ వ్యక్తిగత వ్యవహారాల పట్ల శ్రద్ధ వహించారు. కూతురు మహనీయ ఆయిషా అంటే ఆయనకు ప్రాణం కన్నా అధిక ప్రేమ. ఆమెకు మదీనా పరిసరాలలో తన పక్షాన భూమి ఇచ్చి ఉన్నారు. ఆయన వద్ద మరే ఇతర భూమి లేదు. అందువల్ల ఓ రోజు ఆమెను పిలిపించి, "అమ్మా! నేను నీకు ఇచ్చిన భూభాగంలో నీ సోదరీ సోదరులను సయితం చేర్చుకోవడం ఉత్తమం" అని కోరారు. దానికి ఆమె సరేనన్నారు.

మరణానికి రెండు మూడు నాళ్ళ ముందు, "నా వద్ద ముస్లిముల సొమ్ములో ఒక బానిస రెండు ఒంటెలు తప్ప ఏమీ లేవు. నా మరణం సంభవించగానే వాటిని ఉమర్‌కు అప్పజెప్పవలసింద"ని పురమాయించారు.

ఖిలాఫత్ బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకు సలహా మండలి సహచరులు పట్టు పట్టి సాలీనా వెయ్యిన్నర రూకలు వేతనంగా ఒప్పుకునేలా చేశారు. దాన్ని గురించి, "నా స్వంత భూమి ఫలానా చోట ఉన్నది, దాన్ని అమ్మి, నేను నేటి వరకు తీసుకున్న మొత్తం రొక్కం తిరిగి చెల్లించవలసింద" ని కోరారు.

మృతుని వస్త్రాలను గురించి, "ఇప్పుడు నా ఒంటిపైన ఉన్న వస్త్రం కాక ఇంకా రెండు వస్త్రాలు తీసుకుని ఉతికి వేయండి. మొత్తం మూడవుతాయి. అవి నా కఫన్ కొరకు సరిపోతాయి" అన్నారు.

మహనీయ ఆయిషా దానికి, ఇవన్నీ పాత బట్టలు. నేను కొత్త బట్టలు ఇస్తాను అని చెబితే, "ఆయిషా! కొత్త బట్టలు కావలసింది బ్రతికున్న వారికి. మీ నాన్నకు ఈ పాత బట్టలే సరిపోతాయి" అన్నారు.

## కడపటి కోరిక

ఆ పైన ఆయన అడిగారు, ఈ రోజు ఏ దినమని. సోమవారం అని చెప్పారు. నా నాయకులు కూడా ఈ దినమే కదూ పరమపదించింది? అని అడిగారు. అవునని జవాబు చెప్పారు. ఈ వేళ సాయంత్రం వరకు నేనూ ప్రాణం వదలితే బావుండేది అని కోరుకున్నారు. దైవకృపతో అలాగే జరిగింది! అప్పుడు ఆయన,

**"అన్త వలియ్యి ఫిద్దున్యా వల్ ఆఖిర తవఫ్ఫనీ ముస్లిమన్వ్వ ల్హిక్నీ బిస్సాలిహీన్"**

(దేవా! నీవే ఇహంలోనూ పరంలోనూ నా సహాయకుడివీ, నా రక్షకుడవు. నేను నీ ఆజ్ఞాపాలకునిగా ఉన్న స్థితిలోనే నాకు మృత్యువు నివ్వు. మరణానంతరం నన్ను సజ్జనులలో చేర్చు) అని వేడుకున్నారు.

ఆయన మృత స్నానం, మృత వస్త్రం ఆయన కోరుకున్నట్లే జరిగాయి. ఒక సతీమణి వస్త్రాలు ఉతికి శుభ్రపరిచారు. మరో సతీమణి స్నానం చేయించారు. ఆయన కుమారుడు అబ్దుర్రహ్మాన్ స్నానం చేయించడంలో సహాయపడ్డారు. మహనీయ ఉమర్ జనాజా నమాజ్ చేయించారు. సమాధిలో, అబ్దుర్రహ్మాన్, ఉమర్,ఉస్మాన్, తల్హా దించారు. ప్రవక్త మహనీయుల సమాధి ప్రక్కనే ఈయన సమాధి కూడా. ★




**- డాక్టర్ ముహమ్మద్ హసన్**

"ఏ పాలకుడైతే తన నిర్ణయమే తుది నిర్ణయమని భావిస్తాడో అతడు అన్ని రకాల సంక్షోభాలకు కారకుడవుతాడు. ప్రజల అభిమానాన్ని కోల్పోతాడు" అంటాడు శుక్రాచార్యుడు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా తనను తాను మార్చుకొని ప్రజా సంక్షేమాన్ని కోరే పాలకుడిని ప్రజలు ఎల్లప్పుడు ఆదరిస్తారు. రాజరిక వ్యవస్థను కూలదోసి ప్రజాస్వామ్య విధానాలకు ప్రజలు అలవాటుపడ్డ తరుణంలో అక్కడక్కడ నేటికి కూడా కొద్దిమంది నియంత పాలనకు తెరలేపి అప్రతిష్ట మాటగట్టుకొని చివరికి ప్రజల చేతిలో భంగపడి రాజకీయాల నుండి శాశ్వతంగా నిష్క్రమించిన నాయకులను కూడా చూస్తున్నాం. ఇటీవలే రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పాత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ క్రమంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గత ప్రభుత్వ ఓటమికి కారణాలు ఎన్ని ఉన్నా ప్రస్తుత ప్రభుత్వ విజయానికి అవన్నీ సానుకూల అంశాలుగా పనిచేశాయి. వెరసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను కొత్త ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం అసంపూర్ణంగా ఉంచిన కొన్ని అంశాలను ఇప్పుడు చర్చిద్దాం.

## విద్యా విధానం

తెలంగాణ విద్యా విధానం దేశానికే రోల్ మోడల్ అని ఢంకా బజాయించింది గత ప్రభుత్వం. ప్రైవేటు విశ్వ విద్యాలయాల మీద వున్న శ్రద్ధ ప్రభుత్వ విద్యా విధానం మీద పెట్టలేక పోయింది. ఫలితంగా తెలంగాణలో విద్యా వ్యవస్థ గాడి తప్పింది. ప్రాథమిక పాఠశాల నుండి విశ్వ విద్యాలయాల వరకు బోధించేవారు లేక విద్యా సంస్థలు కూనరిల్లి పోయాయి. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు సుమారు ఎనిమిది వేలు ఉన్నట్లు అధికారుల అంచనా. అదేవిధంగా బాలికలకు మూత్ర శాలలు, మరుగుదొడ్లు లేని పాఠశాలలు అంటూ ఆ మధ్య కాలంలో పత్రికలలో పతాక శీర్షికల్లో చదివాం. ఇటీవలే హైకోర్ట్ రాష్ట్ర రాజదాని హైదరాబాద్ సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు కట్టించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అంతెందుకు ఆదిలాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలో నేటికి కొన్ని చోట్ల బడికి వెళ్ళాలంటే వానకాలంలో వాగులు, పిల్లకాలువలు దాటుకుంటూ వెళ్తున్న పిల్లల్ని చూస్తూనే ఉన్నాం. "గురువులేని విద్య రాణించదు" అన్నట్లు, పాఠశాల స్థాయి నుండి

యూనివర్సిటీల వరకు ఖాళీగా వున్న అన్ని టీచర్ పోస్టులను తక్షణమే భర్తీచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి, ప్రైవేటు విద్యపై నిరంతరం నిఘా, నియంత్రణ, పర్యవేక్షణ చేయాలి. స్కాలర్షిప్లు, ఫీజు రీయంబర్స్మెంటు, హాజరు శాతం 75% పైగా ఉన్న వారికే ఇవ్వాలి లేనిపక్షంలో నిధుల దుర్వినియోగం జరిగే ఆస్కారం వుంది. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించి, తల్లిదండ్రులను ఆ దిశగా చైతన్యం చేయాలి. హాస్టళ్ళలో కూడా మెరుగైన సదుపాయాలు రుచికరమైన భోజన సదుపాయాలు కల్పించాలి. "ఉత్తమ విద్యా విధానం ఉన్నచోట ఉత్తమ సమాజం నిర్మించబడుతుంది" అంటాడు అరిస్టాటిల్. అలాంటి సమాజ నిర్మాణానికి తరగతి గది కేంద్ర బిందువు కావాలి. ఉత్తమ విద్య ద్వారానే ఉపాధి కల్పన, సృజనాత్మక ఆలోచనలు, విలువైన మానవవనరులు, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. పక్కా ప్రణాళికతో కూడిన మంచి విద్యా విధానమే మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తుందనేది గమనించాలి.

## ఉద్యోగాల కల్పన

గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా బిస్వాల్ కమిటి రాష్ట్రంలో ఒక లక్ష తొంబై ఏడు వేల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని నివేదికను ఇచ్చినట్లు సాక్షాత్తు గత ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం దశలవారీగా వాటన్నింటిని భర్తీచేసి వివిధ శాఖల పనితీరును పటిష్టం చేయాలి. గ్రూప్- 1, గ్రూప్ -2, గ్రూప్ -3, గ్రూప్-4, డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, టీచర్ పోస్టులు, ఇతర శాఖలకు సంబంధించిన అన్ని రకాల పోస్టులను తక్షణమే గుర్తించి TSPSCని ప్రక్షాళన చేసి సమర్థులను బోర్డు సభ్యులుగా నియమించి పారదర్శకమైన విధానాన్ని పాటించి నిరుద్యోగులలో నెలకొన్న నిరాశను, కొత్త ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చెయ్యాలి.

## గత ప్రభుత్వ పథకాల రద్దు/ సమీక్ష

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన ధరణి, రైతుబంధు, దళిత బంధు, బెల్టు షాపులు మొదలగు పథకాలు విచ్చలవిడిగా వున్నా మద్యం దుకాణాలను దశలవారిగా తగ్గించే ప్రయత్నం చెయ్యాలి. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రభుత్వం కూడా సుస్థిరంగా ఉన్నట్లు భావించాలి. ప్రజలు ఇబ్బందులకు గురైతే ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తారు. కాబట్టి ప్రజలకు లేదా యువతను వారి స్వశక్తి మీద ఆధారపడి జీవించేలా ఉపాధి కల్పన కేంద్రాలు నెలకొల్పి శిక్షణ ఇవ్వాలి. రాష్ట్రంలో ఎలాంటి మాదక ద్రవ్యాలు దొరకకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటుచేసి డ్రగ్స్‌తో దొరికిన పక్షంలో శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలి. దీనికి పోలిస్ యంత్రాంగం పూర్తిగా క్రియాశీలంగా వ్యవహరించాలి.

## అభివృద్ధి సంక్షేమం అన్ని ప్రాంతాలకు సమానంగా విస్తరించాలి

ప్రాంతం ఏదైనా కావచ్చు, వ్యవసాయికంగా, పారిశ్రామికంగా, వెనుకబడిన ప్రాంతాలైన ఆదిలాబాద్, మహబూబ్ నగర్ ఇతర జిల్లాలకు కూడా సమాన భాగస్వామ్యం కల్పించి, జాతీయ స్థాయి ప్రాజెక్టులు, అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు వచ్చేవిధంగా కృషి చేసి వెనుకబడ్డ ప్రాంతాలకు అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కల్పించాలి. రోడ్లు, పాఠశాలలు, వైద్యశాలలు, పేదలకు ఇండ్లు, త్రాగునీరు, కరెంటు సదుపాయం కల్పిస్తే సహజంగానే ఆ ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలు అందుతున్నట్లుగా భావించాల్సి వుంటుంది. గత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కొంతమేరకు చేసినప్పటికి చాలా విషయాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినందు వల్ల ప్రస్తుత ప్రభుత్వం ఆ లోటును భర్తీచేస్తూ అభివృద్ధిలో సబ్బండ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పది సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రాంతాల వారీగా చేయాల్సినవి, పురోగతిలో ఉన్నవి, పూర్తిగా పెండింగ్‌లో వున్నవి ఇలా విభజించుకొని ప్రాధాన్యతా రంగాలను బట్టి నిధులు కేటాయించి దశలవారీగా అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని మళ్ళించాలి. ఈ విషయంలో ప్రతిపక్షాల నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు స్వీకరించి అధికార పక్షం పాటించాలి, అమలు చేయడానికి కృషిచేయాలి. ప్రతిపక్షాల అంటే శత్రుపక్షం అన్న భావన అధికార పక్షం తొలగించుకోవాలి.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారిగా అమలుపర్చాలి

ముందుగా ఈ ప్రభుత్వం ఎలాంటి హామీలు ఇచ్చిందో ఒకసారి చూద్దాం 1) మహాలక్ష్మి పథకం, మహిళలకు ప్రతినెలా 2500, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం 2) రైతు భరోసా క్రింద ప్రతి రైతుకు 15,000/- కౌలు రైతులకు, 12,000/- వ్యవసాయ కూలీలకు, వరి పంటకు 500 బోనస్ 3) గృహజ్యోతి క్రింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంటు 4) ఇందిరమ్మ ఇండ్లు ఇల్లు లేని వారికి ఇంటి స్థలం 5 లక్షల రుణం, ఉద్యమ కారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం 5) యువ వికాసం క్రింద

మిగతా 13వ పేజీలో...




మదీహా అర్జుమంద్

# గతానికి వీడ్కోలు! నూతనత్వానికి స్వాగతం!!

**కాలం** గిర్రున తిరిగింది. చూస్తుండగానే మరో యేడాది కాలగర్భంలో కలిసిపోయింది. ఎన్నో ఆశలు, ఆశయాలు, బాసలతో గత నూతన సంవత్సరంలోకి ప్రవేశించినవారు తమ ఆశలను, ఆశయాలను ఏ మేరకు సాకారం చేసుకున్నారోగాని, కాలమైతే తనకేమీ సంబంధమే లేనట్లు అప్రతిహతంగా సాగిపోయింది. ఎందుకంటే అదే దాని కర్తవ్యం. ఎవరికోసమూ అది ఆగదు. పరుగే దాని నైజం. నిరంతరం అది పరుగెడుతూనే ఉంటుంది. దానివెనుక పరుగెత్తలేని వారు మరుగున పడిపోతారు. అనంతమైన ఈ కాల ప్రవాహాన్ని దైవం మనకోసం సులభతరం చేశాడు. కనుకనే క్షణాలు, నిమిషాలు, గంటలు, ఘడియలు, ఝాములు అని మనం కాలాన్ని మన సౌకర్యం కోసం రకరకాలుగా విభజించు కున్నాం. ప్రకృతి పరంగా కూడా, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, అమావాస్య, పౌర్ణమి, పగలు, రాత్రి, రోజు, వారం, నెల, సంవత్సరం అనే విభజన ఉది. ఈ ప్రకృతి నియమాన్నే మానవులు అనాదిగా అనుసరిస్తూ వస్తున్నారు. కాలగతిలో కేలండర్లు మారుతుంటాయి. కొత్తవత్సరాలు వస్తూ ఉంటాయి. వివిధ దేశాల్లో, వివిధ మతాల్లో రకరకాల పేర్లతో ఇవి ప్రాచుర్యం పొందాయి. 'ఉగాది' తో కొత్త సంవత్సరం ప్రారంభమైనట్లుగానే, ఇస్లాంలో ' ముహర్రం' నెలతో నూతన సంవత్సరం ప్రారంభమవు తుంది. అలాగే జనవరితో ఆంగ్ల సంవత్సరం ఆరంభమవుతుంది.

కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నప్పుడల్లా, మనకు ఓ విధమైన నూతనత్వపు అనుభూతి కలుగుతుంది. అనునిత్యం మార్పుచెందే ఈ కాల ప్రవాహంలో సంవత్సరాలు మారడం అనేది పెద్ద విశేషమేమీ కాదు. ఈ మార్పు ఒక చిన్న బిందువు లాంటిది. ఆ బిందువే మార్పుకు శ్రీకారం చుడుతుంది. ఇది నిరాటంకంగా, ప్రతినిత్యం జరిగే సహజ ప్రక్రియ. కాలం ఎంత వేగంగా గడిచిపోతుందో తెలుసుకోవాలంటే, కాసేపు గడియారపు సెకన్ల ముల్లు కదలికను గమనిస్తే అర్థమవుతుంది. నిజానికి ఒక్క సెకను కాలం కూడా చాలా విలువైనదే. ఈ ఒక్క సెకనులో వెలుగు లక్షా ఎనభై ఆరువేల మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. ఇది మనకు తెలిసిన లెక్క. దేవుని ఈ సృష్టిలో ఇంతకన్నా వేగంగా పయనించగల అనేక వస్తువులు కూడా ఉండవచ్చు. అవి ఇంకా మన జ్ఞానపరిధిలోకి రాలేదేమో! మనం గోడకు నూతన సంవత్సర క్యాలెండరును వేలాడదీసే ముందుగా, ఎన్నో విషయాలు, గణాంకాలు మారిపోయిన సంగతి మనకు బోధపడుతుంది. అందుకే ఈ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టే ముందు, మనం గతాన్ని నెమరువేసుకొని జాగృతం కావాలి. భవిష్యత్ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు ముందుకు వేయాలి. ఈక్రమంలో గడిచిన కాలాన్ని మరింత దగ్గరగా, నిశితంగా పరిశీలించడం వల్ల ఇక ముందు మనం ఏం చేయాలో,

ఏం చేయకూడదో ఒక స్పష్టత వస్తుంది. మారుతున్న కాలంలో మన జీవితాలు సరైన పంథాలో పయనించడానికి తోడ్పడుతుంది. జీవితంలో సంభవించిన ఆసక్తికరమైన అంశాలతో పాటు, మనపై ప్రభావం చూపిన అంశాలను కూడా ఈ సందర్భంగా పరిగణన లోకి తీసుకోవాలి. వాటిని అవలోకనం చేసుకోవాలి. గతకాలానికి వీడ్కోలు పలికి కొత్తవత్సరానికి స్వాగతం పలికే సమయంలో ఎవరైనా ఆనందానుభూతులకు లోనుకావడం సహజం. సంతోషం అనేది మానవ నైజంలో ఉన్న సహజ గుణం. అయితే, ఆనంద పారవశ్యంలో హద్దుల్ని అతిక్రమించి, నిషిద్ధ కార్యాలకు పాల్పడడం ధార్మికంగానే కాకుండా, సామాజిక పరంగా, నైతిక పరంగా కూడా తగదు. అదినేరమవుతుంది. దీనికి దేవుని దగ్గర సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. అందుకే కాలాన్ని సాక్షిగా పెట్టిదేవుడు అనేక యదార్థాలు చెప్పాడు. ఒక్కసారి మనం వెనక్కి తిరిగి చూస్తేకాలం చెప్పిన అనేక వాస్తవాలు కళ్ళకు కడతాయి. కాలం విలువను గుర్తించినవారు మాత్రమే వాటినుండి గుణపాఠం నేర్చుకోగలుగుతారు. అలా కాకుండా గతకాలాన్ని గాలికొదిలేసి, కొత్తసంవత్సరంలో చైతన్య రహిత చర్యలతో, అర్థం పర్థం లేని కార్యకలాపాలతో కొత్తకాలాన్ని ప్రారంభిస్తే ప్రయోజనం శూన్యం. కాలం ఎవరి కోసమూ ఆగదు. రాజులు రారాజులు, మాన్యులు, సామాన్యులు, పండితులు, పామరులు అంతా కాలగర్భంలో కలిసిపోయినవారే, కలిసి పోవలసినవారే. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేటప్పుడు ఈ వాస్తవాన్ని గుర్తుంచు కోవాలి. గతంనుండి గుణపాఠం గ్రహిస్తూ భవిష్యత్తు కాలానికి స్వాగతం పలకాలి. నిస్సందేహంగా కొత్తసంవత్సరాన్ని సంతోషంగా స్వాగతించాల్సిందే. కాని ఆ సంతోషంలో హద్దుల అతిక్రమణ జరగకుండా చూసుకోవాలి. మందు, చిందు ఇతరత్రా అసభ్య, నిషిద్ధ కార్యాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించడం ఎంతవరకు సమంజసం అన్న స్పృహ జాగృతం కావాలి. కాలం చెప్పే చారిత్రక వాస్తవాలనుండి గుణపాఠం గ్రహించకుండా లక్ష్య రహితంగా భవిష్యత్తును ప్రారంభిస్తే మిగిలేది నిరాశే. అందుకని గడచిన కాలంలో ఏం చేశామన్నది కొత్తసంవత్సరం ప్రారంభాన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మంచిపనులు చేసిఉంటే ఈ కొత్త సంవత్సరంలో వాటిని మరింతగా విస్తృత పరుచుకునే ప్రయత్నం చెయ్యాలి. ఏమైనా తప్పులు, పొరపాట్లు, పాపాలు జరిగి ఉంటే చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందుతూ, ఇక ముందు అలాంటి వాటన్నిటినీ ఖచ్చితంగా విసర్జిస్తామని ప్రతిన బూనాలి. ఇక నుండి ఓనూతన శకానికి నాంది అన్న ఆత్మ విశ్వాసం తొణికిస లాడాలి. గత పాపాల పట్ల సిగ్గుపడి, పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో ఇక వాటి జోలికి పోమని ప్రతిన బూనిన వారిని దేవుడు ప్రేమిస్తాడు. కరుణిస్తాడు. వారి పాపాలను క్షమిస్తాడు. వారి ఇహపర సాఫల్యానికి మార్గం సుగమం చేస్తాడు. జీవితం చాలా చిన్నది. ఎవరి జీవితం ఎప్పుడు సమాప్తమో ఎవరికీ తెలియదు. కనుక ఆనంద సమయమని హద్దుల్ని అతిక్రమించకుండా విలువలతో కూడిన జీవితం గడపడానికి శాయశక్తులా ప్రయత్నిం చాలి. సమాజ హితం కోసం సమయాన్ని వెచ్చించాలి. కాలాన్ని వినియోగం చేసుకోవడంపైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని గ్రహించాలి. ❖

## 11వ పేజీ తరువాయి...

విద్యార్థులకు 5 లక్షల నగదు ప్రోత్సాహం. చేయూత పథకం క్రింద వృద్ధులకు నెలకు 4000 పెన్షన్, 6) రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా. ఇందులో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అమలు చేసింది. నా అభిప్రాయం ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలను కేవలం పల్లెవెలుగు బస్సులకు మాత్రమే పరిమితం చేసి, లేదా దారిద్రరేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించి వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మంచింది. లేనిపక్షంలో ఈ పథకం విమర్శలకు గురయ్యే ఆస్కారం ఉంది. ఇక మిగిలిన పథకాలకు ఎంతమంది అర్హులు, ఎంత ఖర్చు అవుతుందనేది రెవిన్యూ ఆదాయం ఎంత, వ్యయం ఎంత అనేది అధికారికంగా అంచనాలు రూపొందించి దశలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి. లేనిపక్షంలో గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలు చెల్లించడానికి రాష్ట్ర రెవిన్యూ ఆదాయం సగంపైగా వెళ్తుందని అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి. కాబట్టి గత ప్రభుత్వ పథకాలను కొన్నింటిని రద్దుచేసి, కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చెయ్యాలి. "వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించేది ఉత్తమ ప్రభుత్వం. ప్రజల హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించి వారిలో రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందిచుట ద్వారా సంపూర్ణ వికాసానికి తోడ్పడే ప్రభుత్వం ఉత్తమమైనద"ని బ్రిటిష్ తత్త్వవేత్త జాన్ స్టువర్ట్ మిల్ అంటాడు. తెలంగాణ సమాజం ఎన్నో నిర్బంధాలను, బలిదానాలను, అవమానాలను భరించింది. ఇకముందు అలా జరుగకుండా ప్రజాకాంక్ష మేరకు కొత్త ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని ఆశిద్దాం.




# ధర్మంలో కొత్త పోకడ బిద్అత్

- ఆలియా బిన్తె మునీర్ షర్ఫియా

హజ్రత్ ఆయిష (రజి) వారి ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా ప్రవచించారుబీ ఎవరైతే మా ఈ వ్యవహారం (ధర్మం, షరీఅత్)లో లేని కొత్త విషయాన్ని సృష్టిస్తే అది రద్దు చేయబడుతుంది.

పై హదీసు ఇస్లాం మౌలిక సిద్ధాంతాలలో ఒకటి. ఏ విధంగానైతే "ఆచరణలు సంకల్పాలపై ఆధారపడి ఉంటాయి" అనే హదీసు ఆచరణల ఆంతర్యాలు అంటే హృదయాల స్థితిగతుల కొలమానమో అదే విధంగా ఈ హదీసు బాహ్య స్థితిగతుల కొలమానం. ఏ విధంగానైతే అల్లాహ్ ప్రసన్నత కోసం చేయని ఆచరణ ద్వారా మనిషికి ప్రతిఫలం దక్కదో అదే విధంగా బాహ్యపరంగా అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి విధానం ప్రకారంగా లేని ప్రతి ఆచరణ తిరస్కరించబడు తుంది. ఎవరైతే అల్లాహ్, ఆయన ప్రియప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిచే అనుమతించని ఏదైనా కొత్త విషయాన్ని సృష్టిస్తే ఆ ఆచరణకు ధర్మంలో ఎటువంటి స్థానం ఉండదు. అంటే ఆ ఆచరణ స్వీకార యోగ్యమైనది కాదు.

ఆచరణలు రెండు విధాలు : 1) ఆరాధనలు 2) వ్యవహారాలు

ఏ ఆరాధనలైతే అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆదేశాలకు అతీతంగా ఉంటాయో అవి దాసుని ముఖంపై విసిరి వేయబడతాయి.

ఖుర్ఆన్ లో ఇలా ప్రస్తావించబడింది :

అల్లాహ్ అనుమతించకుండానే, ధర్మం వంటి స్వభావం గల ఒక విధానాన్ని తమ కొరకు రూపొందించి దైవభాగస్వాముల నెవరినైనా వారు కలిగి ఉన్నారా? తీర్పు విషయం నిర్ణయింపబడి ఉండకపోతే వారి వ్యవహారం ఎప్పుడో తేల్చివేయబడి ఉండేది. నిశ్చయంగా ఈ దుర్మార్గులకు వ్యధాభరితమైన శిక్ష పడుతుంది. (అష్ షూరా : 21)

ఏ వ్యక్తి అయినా అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి విధివిధానం ప్రకారంగా లేని ఆచరణ ద్వారా అల్లాహ్ ప్రసన్నత పొందాలని కోరుకుంటాడో ఆ ఆచరణ తిరస్కరించ బడుతుంది. వారి ఆచరణ కాబ గృహం వద్ద ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ నమాజు ఆచరించే వారి ఆచరణకు సరి సమానం. లేక ఎవరైనా నృత్యం చేస్తూ లేక ఎండలో తన తలను మండిస్తూ అల్లాహ్ ప్రసన్నతను ఆశించే వారి ఆచరణకు సరి సమానం.

ఒక హదీసులో ఇలా తెలుపబడింది. ఒకసారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు మెంబర్‌పై నుంచుని ఖుత్బ ఇస్తూ ఉండగా ఒక వ్యక్తి వచ్చి ఆ ఖుత్బను గౌరవిస్తూ నీడలోకి రాకుండా, కూర్చోకుండా, ఎండలో నిల్చునే ఖుత్బ వింటానని మొక్కుకు న్నాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు అతనిని నీడలో కూర్చోమని ఆదేశించారు. అతను నిలబడడాన్ని అల్లాహ్ ప్రసన్నతకు ప్రత్యామ్నాయంగా పరిగణించలేదు.

దీనికి భిన్నంగా నమాజులో, అరఫాత్ మైదానంలో దుఆ చేస్తూ నుంచోవడం ఆరాధన అని ప్రకటించబడింది. అదే విధంగా ఇహ్రామ్ స్థితిలో తలను వివస్త్రంగా విడిచిపెట్టడం జరుగుతుంది. ఎండ తలకు తగులుతూ ఉంటుంది. ఒక సందర్భంలో అల్లాహ్ ప్రసన్నతకు ప్రత్యామ్నాయంగా ఉన్నది మరొక సందర్భంలో ఉండదు. షరీఅత్ ఆదేశం ఏమిటి అనేది ఖచ్చితంగా పరికించాలి. ఉదాహరణకు ఉపవాసం ఒక ఆరాధనే. కానీ పండుగల రోజున ఉపవాసం ఉండడం ధర్మనిషిద్ధం. నమాజు ఒక గొప్ప ఆరాధన, కానీ మక్రూహ్ వేళలలో ఆచరించబడదు.

ఒక వ్యక్తి వుజు చేసే శక్తి ఉండి కూడా వుజు లేకుండా నమాజు ఆచరిస్తే నమాజు నెరవేరదు. ఒకవేళ నమాజులో రుకూ, సజ్దాలు సరిగ్గా చేయకపోతే ఆ మేరకే అతని ఆ ఆచరణలో నష్టం వాటిల్లు తుంది. అంటే షరీఅత్‌లో ఈ ఆచరణలు అల్లాహ్ ప్రసన్నత ప్రత్యామ్నాయా లైనప్పటికీ వాటిలో మనిషి తన తరపున ఎంత నష్టం చేకూర్చుకుంటాడో అంత నష్టం కచ్చితంగా వాటిల్లుతుంది.

అలాగే వ్యవహారాల విషయంలో షరీఅత్ ఆదేశాలను మార్చేస్తే వ్యవహారాలు తిరస్కరించబడతాయి. ఉదాహరణకు వ్యభిచారా నికి శిక్షగా డబ్బులు జరిమానాగా ఇచ్చేస్తే అది చెల్లదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి నా అబ్బాయి ఫలానా వ్యక్తి వద్ద పని చేసేవాడు. మా అబ్బాయి ఆ వ్యక్తి భార్యతో వ్యభిచారానికి పాల్పడ్డాడు. నేను ఒక బానిస,100 మేకలు కఫ్ఫారగా ఇచ్చేసాను అన్నాడు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా సెలవిచ్చారు: బానిస, మేకలను నువ్వు తిరిగి తీసివేసుకో. మీ అబ్బాయికి వంద కొరడా దెబ్బలు, ఒక సంవత్సరం పాటు గ్రామ బహిష్కరణ శిక్ష విధించ బడుతుంది.

అదేవిధంగా అల్లాహ్ హక్కు ఏ ఇద్దరి పరస్పర అంగీకారంతో కూడా మార్చబడదు. ఒకవేళ దాసుని హక్కు అయితే పరస్పర అంగీకారంతో వ్యవహారం సద్దుమణుగవచ్చు. కానీ అందులో కూడా షరీఅత్ ను అతిక్రమించరాదు. ఒక వ్యక్తి గర్భిణీ స్త్రీతో వివాహమాడాడు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఆ వివాహాన్ని రద్దు చేశారు. ఎందుకంటే ఇద్దత్ సమయంలో వివాహం జరగదు. అదేవిధంగా మరణించే వ్యక్తి తన ఆస్తిలో మూడవ వంతు ఆస్తి గురించి వీలునామా రాసే హక్కును కలిగి ఉంటాడు. రెండు వంతులపై వారసులకు హక్కు ఉంటుంది. ఒకవేళ ఎవరైనా తన యావదాస్తి గురించి వీలునామా రాస్తే అది షరీఅత్ లో అంగీకరించబడదు.

ధార్మిక వ్యవహారాలలో ఏదైనా కొత్త విషయాన్ని సృష్టించడం లేదా అందులో హెచ్చుతగ్గులు చేయడం దీనినే బిద్అత్ అంటారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నవారు తప్పకుండా తమ ప్రభువు ఆగ్రహంలో చిక్కుకొని తీరుతారు. అవమానం పాలవు తారు. అబద్ధం చెప్పే వారికి మేము ఇటువంటి శిక్షనే విధిస్తాము. (ఆరాఫ్ : 152)

ఈ వాక్యాన్ని విశ్లేషిస్తూ ఇబ్నె ఖలాబ ఇలా వ్రాసారు : ప్రళయం వరకు ఉమ్మత్‌లోని ప్రతీ బిద్అతీ (బిద్అత్ చేసే వ్యక్తి) పరిణామం అల్లాహ్ తరపున ఏమని నిర్ణయించబడిందంటే అతనిపై అల్లాహ్ ఆగ్రహం కురుస్తుంది, అవమానాల బారిన పడతాడు.

హజ్రత్ సహ్ల బిన్ సాద్ (రజి) ఇలా అన్నారు, నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా సెలవిస్తుండగా విన్నాను:

నేను హౌజ్ (కౌసర్) వద్ద మీకోసం ఎదురు చూస్తూ ఉంటాను. ఎవరైతే అక్కడకు చేరుకుంటారో వారు అందులో నుంచి సేద తీర్చుకుంటారు. ఎవరైతే అందులో నుంచి సేద తీర్చుకుంటారో అతనికి ఇక ఎప్పటికీ దప్పిక కలగదు అక్కడ నా వద్దకు కొంతమంది చేరుకుంటారు. వారిని నేను గుర్తు పడతాను. నన్ను వారూ గుర్తుపడతారు. అయితే వారికి నాకు మధ్యన అడ్డు

కలిగించడం జరుగుతుంది. (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు) ఇలా విన్నవించుకుంటారు: ఓ అల్లాహ్ వీరు నావారే. అల్లాహ్ తరపు నుంచి ఇలా సెలవివ్వడం జరుగుతుంది. మీ తరువాత వీరు ఏ కొత్త పోకడలు సృష్టించారో మీకు తెలియదు. అప్పుడు నేను ఇలా అంటాను దూరంగా జరిగిపోండి. నాశనం అయిపోవు గాక ఎవరైతే నా తరువాత కొత్త పోకడలు సృష్టించారో. (బుఖారీ, ముస్లిమ్)

హజ్రత్ హుజైఫ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా ప్రవచించారు: అల్లాహ్ ఒక బిద్అతీ ( బిద్అత్ కు పాల్పడిన వ్యక్తి) నుంచి నమాజు గానీ, దానధర్మాలు గానీ, హజ్జ్ గానీ, ఉమ్రహ్ గానీ, జిహాదు గాని, తౌబ గానీ, కఫ్ఫారహ్ గానీ స్వీకరించడు. పిసికిన పిండిలో నుంచి వెంట్రుక బయటకు వచ్చేసినట్టు అతను ఇస్లాంలో నుండి బయటికి వచ్చేస్తాడు. (ఇబ్నె మాజ)

ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే ఖుర్ఆన్, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి సాంప్రదాయంలో లేని కొత్త పోకడను సృష్టించారో అతను అల్లాహ్ సమక్షంలో హాజరైనప్పుడు అతని పరిస్థితి ఎలా ఉంటుందో అతనికి తెలియదు.

చాలామంది హజ్జ్ యాత్రకు కాలినడకన వెళ్ళామని ప్రకటించు కుంటారు. కొంతమంది ముస్లింలు ఇది ఎంతో పుణ్యంతో కూడుకున్న విషయంగా పరిగణిస్తున్నారు. కానీ హజ్జ్ కాలినడకన నెరవేర్చడం అనేది ఖుర్ఆన్, హదీసుల ద్వారా ఎటువంటి ఆధారం లేనిది. ఇది కూడా ధర్మంలో కొత్త పోకడ (బిద్అత్)

# ముస్లిం బ్యాన్ గురించి మళ్ళీ ట్రంప్ ప్రకటన

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల మాట్లాడుతూ హమాస్‌కు మద్దతు ఇచ్చే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాలను అమలు చేస్తామని, అలాగే యునైటెడ్ స్టేట్స్‌లోకి ముస్లింల ప్రవేశాన్ని నిషేధించాలని ప్రతిపాదించారు. అయోవాలో చేసిన ఈ ప్రకటన, ఇస్లాంపై ట్రంప్ వైఖరి, స్వేచ్ఛా సమానత్వాల నేలగా చెప్పుకునే అమెరికా ఇమేజ్ పై ఈ ప్రకటన ప్రభావం గురించి పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్యక్షుడిగా ట్రంప్ గతంలో అమలు చేసిన వివాదాస్పద 'ముస్లిం నిషేధం' ట్రంప్ తాజా ప్రకటనలో కనిపిస్తోంది. అనేక ముస్లిం-మెజారిటీ దేశాల నుండి అమెరికాలో ప్రవేశాన్ని నిషేధించాడు. ఈ నిషేధంలో వివక్ష ఉంది. ఇస్లామోఫోబియాకు ఆజ్యం పోసే విధానం ఇది. హమాస్ ను ఎదుర్కోవాలనే సాకుతో నిషేధం విధించాలని ట్రంప్ ఇచ్చిన కొత్త పిలుపు, ముస్లిం వ్యతిరేక, విద్వేషాన్ని కొనసాగించడమే. మత స్వేచ్ఛను అణగదొక్కే విధానమని పలువురు విమర్శిస్తున్నారు.

హమాస్ ఇస్రాయీల్ పై దాడి చేసి 1,300 మంది ఇజ్రాయిలీలను హతమార్చిన సంఘటన తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు. హమాస్ దాడి తర్వాత ఇస్రాయీల్ గాజాపై దాడులు ప్రారంభించింది. పాలస్తీనా ఆరోగ్య అధికారుల ప్రకారం గాజాలో వేలాది మంది పాలస్తీనియన్లు మరణించారు. ట్రంప్ చెబుతున్నది ఏమిటంటే, ఇజ్రాయెల్ ను వ్యతిరేకించే వారికి అమెరికాలో ప్రవేశించే అనుమతి ఇవ్వరాదు. యాంటిసెమిటిజం కలిగి ఉన్నారని అనుమానించే విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేయడం వగైరా చర్యలు ట్రంప్ ప్రతిపాదిస్తున్నాడు. ఉగ్రవాద సమస్య ఉన్న దేశాల నుంచి అమెరికాకు ఎవరు రాకుండా నిషేధాలు విధిస్తామని, హమాస్ కు మద్దతు ఇచ్చే ప్రవాసులను బహిష్కరిస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు.

డెమొక్రాటిక్ నేషనల్ కమిటీకి నాయకత్వం వహిస్తున్న జైమ్ హారిసన్తో సహా అనేకమంది విమర్శకులు ట్రంప్ మాటలు ఇస్లామోఫోబిక్ గా పేర్కొన్నారు. భయాందోళనలు సమాజంలో పెంచే ప్రకటనలుగా పేర్కొన్నారు. ఇటువంటి విధానాలు ముస్లింల పట్ల వివక్షను పెంచుతాయి. సమానత్వం, భావ ప్రకటనా స్వేచ్ఛ సూత్రాలను సమర్థించే దేశంగా అమెరికా ప్రతిష్టను దెబ్బతీసే ప్రకటనలుగా పేర్కొన్నారు.

ప్రత్యేక మతస్తులను, ప్రత్యేక జాతిని లక్ష్యంగా చేసుకుని చేసే దాడులను సమర్థించుకోడానికి జాతీయ భద్రతా సమస్యలను ఉపయోగించే ధోరణి ఇది. దీనివల్ల సామాజిక విభజనలు పెరుగుతాయి. అమెరికా చెప్పుకునే మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలకు ఇది వ్యతిరేకమైనది.

# వ్యక్తిత్వం

- ముహమ్మద్ వహీదుద్దీన్

**పూర్వకాలం మాట.** సిద్ధి అంబర్ రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి సిద్ధి అక్బర్ పరిపాలించేవాడు. విశాలమైన సామ్రాజ్యం, లక్షలాది మంది సైనికులు, పచ్చని పంటపొలాలు, విశాలమైన పొడవైన జీవనదులు, సమర్థమైన మంత్రులు రాజ్యంలో ఉన్నారు.

రాజు సిద్ధి అక్బర్‌కు మగ సంతానం కలుగలేదు. ఒకే ఒక కుమార్తె. ఆమె చాలా అందంగా ఉండేది. యుక్త వయసుకు వచ్చింది. వివాహం చేయాలని రాజు సంకల్పించాడు. రాజుకు ఒకటే బెంగ. నా తర్వాత విశాలమైన రాజ్యానికి రాజు ఎవరు? అని తరచుగా ఆలోచనలో మునిగిపోయేవాడు. ఒకరోజు తన కుమార్తెను దగ్గర పిలిపించుకొని ఓ నా ముద్దుల కుమార్తె నీ పెళ్ళి చేయాలని, మంచి సంబంధం కుదిరితే రెండు మూడు నెలలోనే వివాహం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పాడు.

కుమార్తె హసీనా బేగం తన తండ్రిని విచిత్రమైన కోర్కె కోరింది. ఈ రోజు నుంచీ నేను మౌనవ్రతం చేపడుతున్నానని, ఎవరితో మాట్లాడనని, బయటకు ఎక్కడికి వెళ్ళనని, తన గదిలోనే ఉండిపోతానని, గదిలోనే ప్రార్థన చేసుకుంటూ ఉంటాను అని స్పష్టంగా చెప్పేసింది.

ఎందరో రాజ కుమారులు వచ్చి ఆమెను చూడాలని, ఆమెతోనే వివాహమాడాలని అనుకున్నారు. దూరం దూరం నుంచి ఎందరో అందగాళ్ళు, వీరులు, శూరులు వచ్చారు. కొంతమంది ఆమెను చూడటానికి వచ్చేటప్పుడు వజ్రాలు, బంగారం, వెండి మరెన్నో ఆభరణాలు తీసుకొని వచ్చారు. ఆమె బయటకు రాలేదు. తమ అందాన్ని ఎవరికి చూపించలేదు. ఆమె అనుకున్నది వారు కేవలం నా అందం చూసి మాత్రమే వివాహం చేయాలనుకుంటున్నారు అని గట్టిగా అనుకున్నది.

ఇక తాను తన కుమార్తెను వివాహం చెయ్యలేమోనన్న బెంగ పట్టుకుంది రాజు సిద్ధి అక్బర్‌కు. పరిపాలనపై సక్రమంగా దృష్టి పెట్టేవాడు కాదు. ఎప్పుడు వివాహం గురించే ఆలోచించేవాడు.

ఒకరోజు సభ జరుగుతుండగా ఒక యువకుడు కరీంఖాన్ వచ్చాడు. అతని ముఖం తేజోమయంగా ఉన్నా, ధరించిన వస్త్రాలు మాత్రం బీదవాడని తెలుపుతున్నాయి. నీవు ఎక్కడి నుండి వచ్చావు? అని అడిగాడు రాజు. నేను మీ రాజధాని నుంచి దూరంగా ఉన్న అక్బర్‌పేట నుంచి వచ్చాను అని చెప్పాడు.

కరీంఖాన్ మంచి క్రమశిక్షణ గల యువకుడు. ప్రతిరోజు ఐదు పూటలా నమాజ్‌ను ఆచరించేవాడు. దివ్య ఖుర్‌ఆన్‌ను చదివి, ఆచరించి ఇతరులకు చెప్పేవాడు. ఇరుగు పొరుగు వారిని ఇబ్బంది కలిగించేవాడు కాదు. మిత్రులు ఆపదలో ఉంటే వారికి సహాయం చేసేవాడు. ఎవరైనా అతిథులు ఇంటికి వస్తే మర్యాద చేసేవాడు. బంధువులతో మంచిగా మెలిగేవాడు. తల్లిదండ్రులను ఎంతో మంచిగా చూసుకునేవాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చూపిన బాటలో నడిచేవాడు.

రాజా! నేను చాలా బీదవాడిని. మీ దర్బారులో ఏదైనా పని ఉంటే నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను. రాజు కొద్దిసేపు ఆలోచించి నీకు వంటకాలు చేయడం వచ్చా అని అడిగారు. యువకుడు వచ్చు అని సమాధానం ఇచ్చారు. వెంటనే ఈ రోజు నుంచే పని (వంటకాలు) చేయాలని చెప్పాడు. అంతేకాకుండా ఇక్కడే ఉండాలని, ప్రతిరోజు మంచి వంటకాలు చేసి ఆ గది తలుపు దగ్గర అన్నం పెట్టి రావాలని, లోపలికి వెళ్ళే ప్రయత్నం చేయవద్దని చెప్పాడు. సరే అని యువకుడు తలూపాడు.

కరీంఖాన్ రాజుతో నేను నా ఊరికి వెళ్లి తల్లిదండ్రుల దీవెనలు తీసుకొని రెండు రోజులలో వచ్చేస్తాను అన్నాడు. రాజు సరే అని యువకుడిని పంపివేశాడు.

కరీంఖాన్ రాజా సిద్ధి అక్బర్ చెప్పినవిధంగా పని చేసేవాడు. ఒక రోజు గది ముందు ఆహారం పెట్టి వెళుతుండగా హసీనా బేగం ఒక్కసారి తలుపు తీయగా ఆ యువకుడిపై చూపు పడుతుంది. ఆ యువకుడు ఆమెను కన్నెత్తి చూడకుండా ముఖం కిందికి దించివెళ్ళిపోయాడు. రెండో రోజు ఆహారం తీసుకొని రాగా లోపలి నుంచి రోజు గదిలోపల మాత్రమే ఆహారం పెట్టాలి, బయట పెట్టకూడదు అని చెప్పింది. దానికి సరే అన్నాడు యువకుడు.

ప్రతిరోజు గదిలో వెళ్ళి ఆహారం (అన్నం) పెట్టి ఆమెను కన్నెత్తి కూడా చూడకుండా వెళ్ళిపోయేవాడు. హసీనా బేగం గట్టిగా నిర్ణయించుకుంది. నేను పెళ్ళి చేసుకుంటే ఈ యువకుడినే చేసుకుంటాను. ఈ విషయం తన తల్లిదండ్రులకు తెలియ పర్చింది.

రాజు, రాణి కూడా ఆలోచించి అందరి నిర్ణయమే దైవ నిర్ణయం అని, యువకుడు కూడా పెళ్ళికి సిద్ధం కాగా వారి తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి విషయం చెప్పగా వారు కూడా సంతోషంగా కోడలిగా స్వీకరించడానికి సిద్ధమయ్యారు.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించాడు రాజు.

కొన్ని సంవత్సరంలోనే కరీంఖాన్‌కు సింహాసనంపై కూర్చొబెట్టాడు రాజు. కరీంఖాన్ అల్లాహ్‌కు భయపడుతూ దైవప్రవక్త(స) ప్రవచనాలను పాటిస్తూ ఉత్తమ పాలన దిశగా అడుగులు వేశాడు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

30 మీకు ఆవహించిన ఏ విపత్తు అయినా మీరు చేజేతులా సంపాయించుకున్నదే, మరి అనేక తప్పిదాల పట్ల నయితే ఆయన ఇట్టే చూపోపు వహిస్తాడు.[52] మీరు ధరిత్రిలో మీ దైవాన్ని వివశుణ్ణి చేయగలవారు కారు, అల్లాహ్‌కు ప్రతిగా మీకు మరే సమర్థకుడూ, సహాయకుడూ లేడు. ఆయన సూచనలలోనివే ఈ ఓడలు, సముద్రంలో కొండల్లా కనిపిస్తూ ఉంటాయి. అల్లాహ్ తాను కోరినప్పుడు గాలిని నిలువరించగలడు, మరి ఇవి సముద్రం వీపుపైన అట్టే నిల్చుని ఉండిపోగలవు – ఇందులో మహత్తర సూచనలున్నాయి, పరిపక్వమయిన సహనం కృతజ్ఞతా భావం చూపే ప్రతి వ్యక్తికి[53]– లేదా (వాటినెక్కి పయనించేవారి) అనేక అపరాధాలను మన్నించి వారి చేష్టలు కొన్నింటికే శాస్తిగా వారిని ముంచివేయగలడు అప్పుడు మా ఆయత్‌ల విషయంలో వాదులాడే వారికి తెలిసిపోతుంది వారికి ఏ ఆశ్రయమూ లేదని.

52. ఇక్కడ మానవుల ఇక్కట్లన్నింటికీ కారణం వివరించ బడటం లేదు. ఆ సమయంలో మక్కా పుణ్యపురిలో తిర స్కారం, అవిధేయతలకు పాల్పడేవారిని ఉద్దేశించి చెప్పబడు తోంది. వారికి ఇలా చెప్పడం జరుగుతోంది, అల్లాహ్ మీ తప్పిదాలన్నింటికీ మిమ్మల్ని పట్టుకునే మాటయితే మిమ్మల్ని అసలు బ్రతకనిచ్చేవాడు కాదు. కాని మీపై మూడిన ఈ విపత్తులు (బహుశా మక్కా కరవును సూచించడం జరిగింది) కేవలం హెచ్చరికలు మాత్రమే. తద్వారానయినా మీరు స్పృహలోకి రావాలని, మీరు మీ ఆచరణల్ని సమీక్షించుకోవాలని, మీ ప్రభువుకు వ్యతిరేకంగా మీరు ఎటువంటి వైఖరిని అవలంబిస్తున్నారో పరిశీలించుకోవాలని, మీరు ఏ దైవానికి ప్రతిగా తిరుగుబాటును వహిస్తున్నారో ఆయనకెదురుగా మీరు ఎంతగా అశక్తులో అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని, మీరు ఎవరినయితే మీ సంరక్షకులుగా, పనిచేసిపెట్టేవారుగా ఏర్పరచుకున్నారో, లేదా ఏ శక్తులనయితే మీరు నమ్మికూర్చున్నారో వారు మిమ్మల్ని అల్లాహ్ పట్టు నుండి రక్షించేందుకు మీకు ఏవిధంగానూ తోడ్పడ జాలరని మీరు తెలుసుకోవాలనీను.

మరింత వివరణకు మరో విషయాన్ని విశదీకరించడం కూడా అవసరమే. చిత్తశుద్ధిగల నిజమయిన ముస్లిమ్ విషయంలో అల్లాహ్ నియమం దీనికి భిన్నమయింది. అతనికి ఏ ఆపదలు, విపత్తులు, కష్టాలు ఎదురయినా అవన్నీ అతని పాపాలకు, తప్పిదాలకు, కొరతలకు పరిహారమవుతూ ఉంటాయి. హదీసులో ఇలా ఉంది: "ముస్లిమ్ (దైవవిధేయుడయిన వ్యక్తి)కి ఏ బాధ, దుఃఖం, చింత, ఆవేదన, కష్టం, ఆందోళన కలిగినా, కడకు ఒక ముల్లు గుచ్చుకున్నా దాన్ని అల్లాహ్ అతని ఏదో ఒక తప్పిదానికి పరిహారంగా, ప్రాయశ్చిత్తంగా రూపొందిస్తాడు" (బుఖారీ, ముస్లిమ్). పోతే, దైవమార్గంలో, దైవ వచనాన్ని సమున్నతపరచడానికి విశ్వాసి భరించే ఆపదల విషయానికి వస్తే అవి కేవలం లోటుపాట్లకు పరిహారంగా మాత్రమే కాదు, అల్లాహ్ సన్నిధిలో అతని స్థానోన్నతికి మార్గమవుతాయి. దైవ మార్గంలో ఎదురయ్యే ఆపదల విషయంలో, అవి పాపాలకు శాస్తిగా అవతరిస్తాయని భావించడానికి ఎటువంటి ఆస్కారమూ లేదు.

53. "సహనం చూపే వ్యక్తి" అంటే ఉద్దేశం తన మనసును అదుపులో ఉంచుకుని, మంచి పరిస్థితుల్లోనూ, దురవస్థాదశల్లోనూ దైవదాస్య వైఖరి పట్ల నిలకడ చూపే వ్యక్తి అన్నది. అతని స్థితి, మంచిరోజులు వస్తే తనను తానే మరచిపోయి దైవం పట్ల తిరుగుబాటు, దైవదాసులయిన మానవుల పట్ల దౌర్జన్యానికి ఒడిగట్టేవానిలా రూపొందరాదు. మరి చెడ్డ రోజులు వస్తే ఆశలన్నీ వదలుకుని భగ్నహృదయుడయి నీచాతి నీచమయిన చేష్టలకు పాల్పడేందుకు దిగజారిపోరాదు. "కృతజ్ఞతాభావం చూపే వ్యక్తి" అంటే ఉద్దేశం, దేవుని భాగ్య నిర్ణయం అతన్ని ఎంతగా ఉన్నత స్థాయికి లేవనెత్తినా అలా జరగడం తన మహత్తు వల్ల ఏమాత్రం కాదని, అల్లాహ్ మహోపకారమే అని భావించే వ్యక్తి అన్నమాట. అలాకాక దేవుని భాగ్యనిర్ణయం అతన్ని ఎంతగా హీనస్థితికి దిగజార్చినా తాను వంచితుడయిన విషయాలపైన కాక, మనిషికి హీనాతి హీనమయిన అవస్థల్లోనూ ప్రాప్తమయి ఉండే వరప్రసాదాలపైనే అతని దృష్టి కేంద్రీకృతమయి ఉండాలి, సౌభాగ్య దౌర్భాగ్య సర్వావస్థల్లోనూ అతని నోటిద్వారానూ హృదయంలోనూ తన ప్రభువు పట్ల కృతజ్ఞతా భావమే వెల్లడి అవుతూ ఉండాలి.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసిన సంఘటన, ఆయన ఖిలాఫత్‌పై ప్రవక్త సహచరుల (రజి.అన్హుమ్) ఏకాభిప్రాయం

ఈ అధ్యాయంలో అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) వీర మరణం గురించి...

**345)** అమ్ర్ బిన్ మైమూన్ కథనం: నేను హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)ను, ఆయన గాయపడక కొన్ని రోజుల క్రితం మదీనాలో చూశాను; ఆయన హుజైఫా బిన్ యమాన్, ఉస్మాన్ బిన్ హునైఫ్ (ర.అన్హుమా)లతోపాటు నిలబడి ఉన్నారు. ఆయన వాళ్ళను ఉద్దేశించి, "మీరు ఇరాక్ భూముల విషయంలో భరించశక్యం కాని శిస్తు భారం మోపలేదు కదా!?"[1] అని అడిగారు. దానికి వారిద్దరూ, 'మేము భూసారాన్ని బట్టే శిస్తు విధించాము. తలకు మించిన భారం వారిపై వేయలేదు' అని సమాధానమిచ్చారు. దానికి ఉమర్(రజి) "బాగా ఆలోచించుకోండి! భూసారానికి మించిన శిస్తు విధించలేదు కదా!" అని మరోసారి రెట్టించగా, 'అలా జరగనేరదు' అని వారిద్దరూ చెప్పినట్లు ఉల్లేఖకుడు తెలిపారు. అప్పుడు ఉమర్ (రజి) ఇలా అన్నారు: "అల్లాహ్‌యే గనక నాకు మరింత జీవితం ప్రసాదిస్తే నేను ఇరాక్‌లోని వితంతువుల సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తాను. దాంతో నా తదనంతరం వారు ఎవరి మీద కూడా ఆధారపడవలసిన అగత్యం ఉండదు."[2]
ఉల్లేఖకుడైన అమ్ర్ బిన్ మైమూన్ ఇలా అన్నారు: ఈ సంభాషణ జరిగిన నాల్గవ రోజునే హజ్రత్ ఉమర్ (రజి) గాయపరచబడ్డారు. నేను (ఫజ్ర్ నమాజ్ కోసం) పంక్తిలో నిలబడి ఉన్నాను. నాకూ– ఆయన గారికి మధ్యన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తప్ప ఎవరూ లేరు. మహనీయ ఉమర్(రజి) అలవాటు ఏమిటంటే, ఇమామత్ కొరకు ముందుకు వెళ్ళేటప్పుడు, "వరుసలు తిన్నగా ఉండేలా చూసుకోండి" అని తాకీదు చేసేవారు. పంక్తులలో ఎలాంటి వంకర, ఖాళీ లేదని నిర్ధారించుకున్న మీదటే ముందుకు వెళ్ళి తక్బీర్ పలికేవారు. ఫజ్ర్ నమాజ్‌లోని మొదటి రకఅత్‌లో సాధారణంగా సూరయె యూసుఫ్ లేదా సూరయె నహ్ల్‌ను లేదా అంతే సుదీర్ఘమయిన మరేదయినా సూరాను పారాయణం చేసేవారు. మొదటి రకఅత్ పారాయణం పూర్తయ్యేసరికి జనులు పెద్దసంఖ్యలో సామూహిక నమాజ్‌లోకి వచ్చి చేరేవారు. ఆ రోజు కూడా ఆయన తక్బీర్ పలికిన మీదట, "నన్ను హతమార్చటం జరిగింది లేదా కుక్క కరిచింది" అని ఆయన చెప్పటం నేను విన్నాను. అబూ లూలూ ఆయన్ని గాయపరిచాడు. ఆ తర్వాత ఆ దుర్మార్గుడు తన కత్తిని తీసుకుని పరుగెత్తాడు. తనకు కుడివైపున, ఎడమ వైపున అడ్డం వచ్చిన వారినల్లా గాయపరుస్తూ మరీ పరుగెత్తాడు. ఆ విధంగా అతను మొత్తం 13 మందిని గాయపరిచాడు. గాయపడిన వారిలో ఏడుగురు అమరగతి నొందారు. ముస్లింలలోని ఒక వ్యక్తి ఈ పరిస్థితి స్వరూపాన్ని వీక్షించారు. ఆయన ఆ దౌర్భాగ్యునిపై దుప్పటి విసిరారు. దుప్పటిలో చిక్కుకున్న ఆ హంతకుడు తాను పట్టుబడిపోయానని అర్థమవగానే కత్తితో కుత్తుక కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గాయపడిన స్థితిలోనే మహనీయ ఉమర్(రజి) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) చెయ్యి పట్టి నమాజ్ సారథ్యం కొరకు ముందుకు పంపారు. ఉమర్(రజి)కు దగ్గరగా ఉన్నవారంతా నేను చూసిన దృశ్యాన్ని చూశారు. కాని వెనుక పంక్తుల్లో ఉన్నవారికి, పంక్తుల అంచుల్లో ఉన్న వారికి పరిస్థితి నిజస్వరూపం తెలీదు. అయితే నమాజులో మహనీయ ఉమర్(రజి) కంఠస్వరం వినకపోవడంతో వారు 'సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్' అనసాగారు. ఎట్టకేలకు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) క్లుప్తంగా నమాజ్ చేయించారు. నమాజ్ ముగించుకుని జనులు వాపసు అవుతుండగా, "ఇబ్నె అబ్బాస్! నన్ను గాయపరిచిన వాడు ఎవరో కాస్త కనుక్కో" అని పురమాయించారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కొన్ని క్షణాలు అటూ ఇటూ తిరిగి వచ్చి 'గాయపరిచిన వ్యక్తి ముగీరా (రజి) బానిస (అబూ లూలూ)' అని చెప్పారు. "అంటే, ఆ చేతి పని నిపుణుడేనా?" అని ఉమర్(రజి) ఆరా తీయగా, 'అవును' అని ఇబ్నె అబ్బాస్ చెప్పారు. అది విని, "అల్లాహ్ అతన్ని నాశనం చెయ్య. నేనైతే

అతనికి ఒక మంచి మాట చెప్పాను. దానికి అతను ఇచ్చిన ప్రతిఫలం ఇదా? నేను ముస్లింని అని చెప్పే వ్యక్తి చేత అల్లాహ్ నా ప్రాణం తీయలేదు. అందుకుగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు. '(ఇబ్నె అబ్బాస్!) అరబ్బేతర బానిసల్ని భారీ సంఖ్యలో మదీనాకు తీసుకురావాలని నువ్వూ, నీ తండ్రి కోరుకున్నారు కదా!' అని ఉమర్(రజి) చెప్పగా, 'తమరు ఆజ్ఞాపిస్తే మేము వారి పనిపడతాం' అని ఇబ్నె అబ్బాస్(రజి) అన్నారు. అంటే మీరు ఆదేశించిన మరుక్షణమే మదీనాలో నివసించే అరబ్బేతర బానిసలను హతమారుస్తామని అన్నారు. "నీ ఆలోచన పనికి మాలినది. ఇది ఘోరమైన తప్పిదం. ముఖ్యంగా వారు నీ భాష మాట్లాడే వారైనప్పుడు, నీ ఖిబ్లా వైపు తిరిగి నమాజ్ చేస్తున్నప్పుడు, నీ లాగే హజ్జ్ క్రియలు ఆచరిస్తున్నప్పుడు (వారిని చంపుతావా? కడు శోచనీయం)" అని వారించారు.

తరువాత మహనీయ ఉమర్(రజి)ను ఆయన నివాస గృహానికి తరలించారు. మేమంతా వెంట వెళ్ళాము. అటువంటి విపత్కర పరిస్థితి తమకెప్పుడూ ఎదురవ లేదన్నట్లుగా ఆవేదనకు గురయ్యారు జనులు. ఆయనకేమీ కాదు. తొందరగానే కోలుకుంటారని కొందరు చెప్పుకుంటే, ఆయన జీవితం ప్రమాదంలో పడిందని మరికొందరు చెప్పుకోసాగారు. అంతలో ఖర్జూరపు పానీయం తీసుకువచ్చారు. ఆ పానీయాన్ని ఆయన సేవించారు. కాని అది కడుపులో నుంచి బయటకు వచ్చేసింది. తరువాత పాలు సమర్పించారు. ఆయన పాలు త్రాగారు. కాని అది కూడా గాయపడిన రంధ్రం గుండా బయటకు వచ్చేసింది. ఇక ఆయన వీర మరణం తథ్యమని జనులు అనుకున్నారు. మేము లోనికి వెళ్ళాము. జనులు ఆయనపై ప్రశంసా వర్షం కురిపించసాగారు. అంతలో ఒక నవ యువకుడు లోనికి వచ్చి 'అమీరుల్ మోమినీన్! అల్లాహ్ తరఫు నుండి మీకు శుభవార్త! మీకు ప్రవక్త మహనీయుల(స) సాంగత్యం లభించింది. తొలికాలంలోనే ఇస్లామ్ స్వీకరించే భాగ్యం కూడా మీకు ప్రాప్తమయింది. తరువాత మీరు ఖలీఫా అయ్యారు. ధర్మంగా పరిపాలించారు. చివరకు అమరగతినొందారు' అని చెప్పాడు. ఆ మాట విన్న ఉమర్(రజి) "నా వ్యవహారం సరిసమానమై ముగిసినా చాలు. అంటే బహుమానం లభించకపోయినా ఫరవాలేదు, శిక్షపడకుండా ఉంటే చాలు, నేను సంతోషిస్తాను" అన్నారు. ఆ నవయువకుడు తిరిగి వెళుతున్నప్పుడు అతని లుంగీ (లేక ఇజారు) నేలకు రాసుకునేలా వ్రేలాడుతున్నట్లు కనిపించింది. "ఆ అబ్బాయిని నా దగ్గరకు పిలుచుకుని రండి" అని కోరారు ఉమర్(రజి). అతను వచ్చాక, "నా భ్రాతృజుడా! నీ అంగవస్త్రాన్ని కాస్త పైకి కట్టుకో. ఇలా చేయటం వల్ల ఇటు నీ వస్త్రం ఎక్కువ కాలం పనికివస్తుంది. అటు నీవు నీ ప్రభువు ఆగ్రహం నుండి తప్పించుకున్నట్టూ ఉంటుంది" అని హితవు పలికారు.

తరువాత తన కుమారుణ్ణి ఉద్దేశించి, "ఓ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్! నాపై ఉన్న అప్పుల భారం ఎంతో కాస్త లెక్క కట్టు" అన్నారు. జనులు ఆయన చేసిన అప్పుల గురించి ఆరా తీయగా అది దాదాపు **86** వేలు అని తేలింది. అప్పుడాయన ఇలా అన్నారు: "ఈ అప్పులన్నీ ఉమర్ కుటుంబీకుల సంపదతో తీరిపోయేటట్లయితే, వారి సంపదతోనే తీర్చాలి. తీరకపోతే బనీ అదీ బిన్ కాబ్‌ను అడగండి. వారి సొమ్ముతో కూడా తీరకపోతే ఖురైషులను అడగండి. వారు తప్ప వేరితరులను అప్పులు తీర్చమని అభ్యర్థించరాదు. (అబ్బాయి అబ్దుల్లాహ్!) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వెళ్ళు. ఉమర్ మీకు సలామ్ చెప్పాడని చెప్పు. 'అమీరుల్ మోమినీన్' అని మాత్రం అనకు. ఎందుకంటే ఇప్పుడు నేను విశ్వాసుల నాయకుణ్ణి కాను. ఉమర్ బిన్ ఖత్తాబ్ తన ఇద్దరు మిత్రులతోపాటు అక్కడే ఖననం కావడానికి అనుమతి కోరుతున్నాడని చెప్పు".

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(అమ్మ ఆయిషా-ర.అ-దగ్గరకు వెళ్ళి) సలామ్ చేశారు. ఆమె అనుమతితో లోపలికి వెళ్ళారు. ఆ సమయంలో ఆమె కూర్చుని దుఃఖంతో విలపిస్తున్నారు. 'అమ్మా! ఖత్తాబ్ పుత్రుడు మీకు సలామ్ చెప్పారు. తన ఇద్దరు మిత్రులతోపాటే ఖననం కావడానికి మీ ఆనతి కోరారు' అని చెప్పారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్. దానికి ఆమె, "ఈ స్థలాన్ని నేను నా కోసం ఎంపిక చేసుకున్నాను. అయితే ఈ రోజు నేను నాపై ఆయనకు ప్రాధాన్యత ఇస్తున్నాను" అన్నారు. ఇబ్నె ఉమర్(రజి) తిరిగి రాగానే, 'ఇదిగో, అబ్దుల్లాహ్ వచ్చేశార'ని జనులు చెప్పారు. "నన్ను కాస్త లేపండి" అని ఉమర్(రజి) అభ్యర్థించారు. ఒకాయన ఆయనకు ఊతమిచ్చి కూర్చోబెట్టారు. "చెప్పు. అమ్మ ఆయిషా ఏమన్నారు?" అని కొడుకును అడిగారు ఉమర్. దానికి ఇబ్నె ఉమర్, 'అమీరుల్ మోమినీన్! మీ ఆకాంక్ష నెరవేరింది' అని చెప్పారు. "అల్ హమ్దులిల్లాహ్! నా కొరకు ఇప్పుడు ఇంతకన్నా ముఖ్యమైనది మరేదీ కాజాలదు. అయితే నేను చనిపోయి, నా శవపేటికను తీసుకెళ్ళినప్పుడు

మరోసారి (ఆమెకు) నా సలామ్ చెప్పండి. ఉమర్ బిన్ ఖత్తాబ్ మీ అనుమతి కోరాడమ్మా! అని మరోసారి విన్నవించుకోండి. ఆమె అనుమతిని ప్రదానం చేస్తేనే నన్ను అక్కడ ఖననం చేయండి. అనుమతి ఇవ్వకపోతే ముస్లింల ఖననవాటికలోనే ఖననం చేయండి" అని తాకీదు చేశారు.

అంతలో ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా(ర.అ) అక్కడికి వచ్చారు. ఆమె వెంట మరికొంతమంది మహిళలు కూడా ఉన్నారు. మేము ఆమెను చూడగానే లేచి నిలబడ్డాము. ఆమె తన తండ్రిని సమీపించి దుఃఖంతో విలపించసాగారు. తరువాత పురుషులు లోనికి రావడానికి అనుమతి కోరటంతో ఆమె ఇంటిలోపలి గదిలోనికి వెళ్ళిపోయారు. మేము ఆమె ఏడుపు శబ్దం విన్నాము.

జనులు హజ్రత్ ఉమర్(రజి)ని ఉద్దేశించి, 'అమీరుల్ మోమినీన్? ఖిలాఫత్ నిమిత్తం ఏమన్నా వసీయతు చేయండి' అని అభ్యర్థించారు. దానికి ఆయన ఇలా అన్నారు : "దైవప్రవక్త (స) తన మరణకాలం వరకు ఎవరెవరి పట్ల సంతుష్టుల ఉన్నారో వారు తప్ప మరెవరినీ నేను ఖిలాఫత్‌కు అర్హులుగా భావించను"– తరువాత ఆయన అలీ, ఉస్మాన్, జుబైర్, తల్హా, సాద్ బిన్ అబీ వక్కాస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ల పేర్లు ప్రస్తావించారు. తన కుమారుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ పేరు కూడా ప్రస్తావించారు. అయితే అతన్ని కేవలం సలహా సంప్రతింపుల వరకే ఉంచండి. ఖిలాఫత్‌తో అతనికి ఎట్టి సంబంధం ఉండకూడదని మరీ మరీ చెప్పారు. "ఒకవేళ సాద్‌కు ఖిలాఫత్ దక్కితే అతను దానికి అర్హుడే. ఒకవేళ అతను ఖలీఫా కాలేకపోతే, ఖలీఫాగా ఎన్నికయిన వ్యక్తి తన పరిపాలనా కాలంలో అతని సహాయ సహకారాలు పొందుతూ ఉండాలి. ఎందుకంటే నేనతన్ని (కూఫా గవర్నర్ పదవి నుంచి) తొలగించినది అతని అసమర్థత కారణంగానో, నమ్మకద్రోహం వల్లనో కాదు" అని స్పష్టం చేశారు. హజ్రత్ ఉమర్(రజి) ఇంకా ఇలా అన్నారు : "నా తదనంతరం కాబోయే ఖలీఫాకు, తొలికాలపు ముహాజిర్ల విషయంలో వసీయతు చేస్తున్నాను– అతను వారి హక్కులను గుర్తెరగాలి. వారి పట్ల మర్యాదగా మసలుకోవాలి. ఇంకా నా తర్వాత కాబోయే ఖలీఫాకు నేను చేసే వసీయతు ఏమిటంటే, అతను అన్సార్ల పట్ల ఉత్తమ రీతిలో వ్యవహరించాలి. వారు దారుల్ హిజ్రత్, దారుల్ ఈమాన్ (మదీనా)లో దైవప్రవక్త(స) రాకకు ముందు నుంచే నివసిస్తూ ఉన్నారు. అన్సార్లలోని సజ్జనులను ఖలీఫా సత్కరించాలి. వారిలోని దుర్వర్తనులను క్షమించాలి. కాబోయే ఖలీఫాకు నేను చేసే మరొక తాకీదు ఏమిటంటే అతను పట్టణవాసుల పట్ల సద్వ్యవహారం చేయాలి. వారు ఇస్లామ్‌కు సహాయకులు, రెవిన్యూ విషయంలో తోడ్పాటు నందించేవారు. ఇస్లామ్ విరోధులకు మింగుడుపడని వారు. కాబట్టి వారివద్ద మిగిలి ఉన్న దానినే (బైతుల్ మాల్ కొరకు) వసూలు చేయాలి. సంతోషంగా వారు ఇచ్చినదే తీసుకోవాలి. పల్లెటూరి బైతుల విషయంలో కూడా మంచిగా వ్యవహరించవలసినదిగా నేను కాబోయే ఖలీఫాకు తాకీదు చేస్తున్నాను. ఎందుకంటే వారు అసలు సిసలు అరబ్బులు. ఇస్లామ్‌కు మూలాల వంటివారు. వారి వద్ద మిగిలి ఉన్న సొమ్మును (జకాత్‌గా)వసూలు చేసి, వారిలోని అవసరార్థుల మధ్యనే దానిని పంపిణీ చేయాలి. ఇంకా నేను కాబోయే ఖలీఫాకు చేసే వసీయతు ఏమిటంటే, దైవం మరియు దైవప్రవక్త యొక్క ఒడంబడికను కనిపెట్టుకుని ఉండాలి (ముఖ్యంగా ముస్లిమేతరులతో చేసుకున్న ఒడంబడికను). వారికి చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. వారి రక్షణకోసం అవసరమైతే యుద్ధం చేయాలి. వారి శక్తికి మించిన (రెవిన్యూ) భారం వారిపై మోపరాదు.

మహనీయ ఉమర్(రజి) తనువు చాలించిన తరువాత మేము ఆయన (శవ పేటిక)ను తీసుకుని (హజ్రత్ ఆయిషా–ర) కుటీరం వైపునకు వచ్చాము. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆమెకు సలామ్ చేసి, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) మీ అనుమతి కోరారని చెప్పారు. "ఆయన్ని ఇక్కడే ఖననం చేయండి" అని ఆమె చెప్పారు. అందువల్ల ఆయన అంత్యక్రియలు అక్కడే జరిగాయి.

అంత్యక్రియలు ముగిసిన తర్వాత, మరణానికి ముందు ఉమర్(రజి) ఎవరెవరి పేర్లు ప్రస్తావించారో వారంతా ఒకచోట సమావేశమయ్యారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి), ఆ మండలిని ఉద్దేశించి, "మీరు మీ వ్యవహారాన్ని మీలోని ముగ్గురు వ్యక్తులకు అప్పగించాలి" అన్నారు. "నేను నా వ్యవహారాన్ని అలీ(రజి) పరం చేస్తున్నాను" అని జుబైర్(రజి) చెప్పారు. "నేను నా వ్యవహారాన్ని ఉస్మాన్(రజి) చేతిలో పెడుతున్నాను" అని తల్హా (రజి) అన్నారు. "నేను నా వ్యవహారాన్ని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)కి అప్పగించాన"ని సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) చెప్పారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)గారు

**ఉస్మాన్, అలీలను ఉద్దేశించి, “మీరిద్దరిలో ఎవరు ఖిలాఫత్‌ను ఆశించటంలేదని ప్రకటిస్తారో వారినే మేము ఖలీఫాగా చేస్తాము. అలాంటి వ్యక్తికి అల్లాహ్ సహాయకునిగా, సంరక్షకునిగా ఉంటాడు. ఇస్లామ్ హక్కు లను కాపాడే బాధ్యత అతనిపై ఖచ్చితంగా ఉంటుంది. ఈ కోణం నుంచి ఎవరు ఈ బాధ్యతలకు తగినవారో మీలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి” అని స్పష్టం చేశారు. ఇది విని వారిద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఇలా అన్నారు: “ఏమిటి, మీరిద్దరూ ఈ ఎంపిక బాధ్యతను నా మీద మోపుతున్నారా? దైవసాక్షి! మీరిద్దరిలో అందరికన్నా శ్రేష్టుడైన వానినే నేను ఎంపిక చేస్తాను.” “సరే. అలాగే చేయండి” అని వారిద్దరూ పలికారు. అప్పుడు ఆయన వారిద్దరిలో ఒకరి చేయి పట్టుకుని, “చూడండి, దైవప్రవక్త(స)తో మీకు రక్త సంబంధం ఉంది. తొలి కాలంలో ఇస్లామ్ స్వీకరించిన గౌరవం కూడా మీకు దక్కింది. ఈ విషయం మీకు సయితం తెలుసు. అల్లాహ్‌యే మీ పర్యవేక్షకుడు. ఒకవేళ నేను గనక మిమ్మల్ని ఖలీఫాగా చేస్తే న్యాయబద్ధంగా పరిపాలిస్తారా? ఒకవేళ నేను గనక ఉస్మాన్(రజి)ను ఖలీఫాగా చేస్తే, మీరు ఆయన ఆదేశాలను శిరసావహిస్తారా? ఆయనకు విధేయత చూపుతారా?” అని అడిగారు. ఆ తర్వాత రెండవ వ్యక్తిని ఏకాంతంలోనికి తీసుకెళ్ళి ఆయన్ని కూడా అలాగే అడిగారు. ఆయన నుండి వాగ్దానం పొందిన తరువాత, “ఉస్మాన్! మీ చేయి ముందుకు చాపండి” అన్నారు. అందరికంటే ముందు ఉస్మాన్ చేతిలో చెయ్యేసి విధేయతా ప్రమాణం (బైఅత్) చేశారు. మహనీయ అలీ(రజి) కూడా ఆయనకు ప్రమాణబద్ధులయ్యారు. తరువాత మదీనా వాసులంతా వచ్చి విధేయతా ప్రమాణం చేశారు.**[3]

345-1. ఆ ఇద్దరు వ్యక్తులను ఖలీఫా భూమి శిస్తును నిర్ధారించడానికి ఇరాక్ ప్రాంతానికి పంపించారు.

345-2. ఆ రోజుల్లో ఇరాక్ ప్రదేశంలో లూటీలు, బందిపోట్లు యధేచ్ఛగా జరిగేవి. దీంతో వితంతు స్త్రీలు మరిన్ని కష్టాలను ఎదుర్కోవలసి వచ్చేది. ఎందుకంటే వారిని ఆదుకునే మగదిక్కు ఉండేది కాదు. అందువల్ల అక్కడ శాంతిభద్రతలను నెలకొలిపి, వితంతువులకు అభయం కల్పించాలని ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) నిశ్చయించుకున్నారు.

345-3. మహనీయ ఉమర్(రజి) హత్యోదంతం దారుణమైనది. హజ్రత్ ముగీరా (రజి)కు చెందిన అరబ్బేతర బానిస అబూ లూలూ అనే దౌర్భాగ్యుడు విషం పూసిన కత్తితో ఖలీఫాకు మూడుసార్లు కత్తి పోట్లు పొడిచాడు. ఆ కత్తిని అతను స్వయంగా తయారు చేశాడు. ‘ఆ కుక్కను పట్టుకోండి. వాడు నన్ను పొడిచాడు’ అని హజ్రత్ ఉమర్(రజి) సైగ చేశారు. ఆ దుర్మార్గుడు మంచి వృత్తి నిపుణుడు. కమ్మరి, వడ్రంగి, చిత్రకారుడు కూడా. ముగీరా అతని నుండి నెలకు 100 దిర్హముల చొప్పున జిజ్‌యా తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. తనపై విధించిన భారం చాలా ఎక్కువ అని, దానిని కొంత తగ్గించమని అతను హజ్రత్ ఉమర్(రజి)కు ఫిర్యాదు చేశాడు. నీ లాంటి వృత్తి నిపుణుడు నెలకు వంద దిర్హములు చొప్పున చెల్లించటం కష్టమేమీ కాదని హజ్రత్ ఉమర్(రజి) నచ్చ జెప్పారు. దాంతో అతనికి కోపం వచ్చింది.

ఒకసారి అతను హజ్రత్ ఉమర్(రజి)కు దారిలో కనిపించినప్పుడు, నీవు తిరుగలి రాయిని చేయటంలో నిపుణుడవని విన్నాను, నిజమేనా? అని అడిగారు. దానికి అతను, ‘నేను మీ కోసం జనులు ఎల్లకాలం గుర్తుంచుకునే తిరుగలి రాయిని చేసి ఇస్తాన’న్నాడు. అతని మాటల్లోని దురుద్దేశాన్ని హజ్రత్ ఉమర్(రజి) పసిగట్టి, ఆ బానిస నన్ను బెదిరిస్తున్నాడని తన సహచరులతో అన్నారు. ఇది జరిగిన కొన్నాళ్లకే అతను ఈ దారుణానికి పాల్పడ్డాడు. ‘ముస్లిం’ వెలికి తీసిన హదీసు ప్రకారం మహనీయ ఉమర్ (రజి) అమరగతినొందక ముందు ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు: “ఒక కోడిపుంజు కలలో నన్ను తన ముక్కుతో మూడుసార్లు పొడిచింది. దాంతో నా మరణ కాలం సమీపించిందని నేను తలపోశాను.” గాయపడిన కొన్ని రోజుల తర్వాత ఆయన పరమ పదించారు.

మహనీయ ఉమర్(రజి) ఖిలాఫత్ కొరకు నియమించిన కమిటీలో తన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను కేవలం సలహా సంప్రతింపుల వరకే పరిమితం చేయటం గమనార్హ విషయం. ఆ సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు. తబ్రీ, ఇబ్నె సాద్ సంగ్రహించిన ఒక ఉల్లేఖనం ప్రకారం, ‘అబ్దుల్లాహ్‌ను ఖలీఫాగా చేయండి’ అని ఒక వ్యక్తి సలహా ఇవ్వగా, “అల్లాహ్ నిన్ను నాశనం చెయ్య. నేను అల్లాహ్ వద్దకు ఏం ముఖం పెట్టుకుని వెళ్ళాలి?” అని సమాధానమిచ్చారు ఉమర్ (రజి). సుబ్‌హా నల్లాహ్! నిష్కల్మష హృదయానికి, న్యాయశీలతకు, నిష్పక్షపాత బుద్ధికి ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది? సమర్థుడు, జ్ఞాని అయిన కొడుకు తన ఇంట ఉన్నప్పటికీ ఆయన రాగద్వేషాలను దరికి రానివ్వలేదు. ఆశ్రిత పక్షపాతానికి, బంధు ప్రీతికి లొంగలేదు. తాను జీవించి ఉన్నంతకాలం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కు ఉసామా బిన్ జైద్‌కన్నా తక్కువ పెన్షన్ ఇచ్చారు. అబ్దుల్లాహ్ ఉసామా కన్నా తక్కువేమీ కాదు కదా! పైగా అబ్దుల్లాహ్ దైవప్రవక్త(స)తో కలసి యుద్ధాలలో కూడా పాల్గొన్నారని సహాబా సిఫారసు చేయగా, “దైవప్రవక్త(స) ఉసామా తండ్రిని అబ్దుల్లాహ్ తండ్రికన్నా ఎక్కువగా ప్రేమించేవారు. అందుకే నేను దైవ ప్రవక్త(స) ప్రేమకు నా ప్రేమపై ప్రాధాన్యత ఇచ్చాన”ని చెప్పారు మహనీయ ఉమర్(రజి).

హజ్రత్ ఉమర్(రజి) ఖలీఫాగా ఉన్నంతకాలం అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆర్థిక ఇబ్బందుల్లోనే ఉన్నారు. పైగా ఆయనకు సంతానం ఎక్కువ. చివరకు ఆయన యమన్ రాష్ట్ర గవర్నర్ వద్దకు వెళ్ళి తన ఆర్థిక ఇక్కట్లను గురించి చెప్పుకున్నారు. అంతా విన్న మీదట, ‘మీ నాన్నగారు ఎంత ఖచ్చితమైన మనిషో మీకు తెలుసు. నేను బైతుల్ మాల్ నుండి ఒక్క దిర్హమ్ కూడా మీకు ఇవ్వలేను. అయితే ఒక పని చేయండి, నేను మదీనాకు కొంత డబ్బు పంపించాల్సి ఉంది. దానిని మీకు ఇస్తాను. ఆ డబ్బుతో ఇక్కడ వస్త్రాలు కొని మదీనాలో అమ్మండి. తద్వారా వచ్చిన లాభాన్ని మీరు తీసుకుని అసలు సొమ్మును ప్రభుత్వ ధనాగారంలో జమ చెయ్యండి’ అని సలహా ఇచ్చాడు ఆ గవర్నర్. అదే భాగ్యం అనుకున్నారు అబ్దుల్లాహ్. ఆయన మదీనాకు తిరిగి వచ్చినప్పుడు ఆ విషయం తెలుసుకున్న ఖలీఫా ఉమర్(రజి), “అసలు సొమ్ముతోపాటు, దానిపై వచ్చిన లాభాన్ని కూడా కోశాగారంలో జమ చెయ్యి. ఎందుకంటే ఆ సొమ్ము నీదీ కాదు, నీ అబ్బదీ కాదు” అన్నారు. పాపం, అబ్దుల్లాహ్ అంత దూరం నుంచి ప్రయాణం చేసి వచ్చారు. ప్రభుత్వ బొక్కసానికి చేరవలసిన డబ్బును భద్రంగా తీసుకు వచ్చారు. అందుచేత ఆయనకు కొంత వేతనం లభించటం న్యాయం అని సహచరమాన్యులు నచ్చజెప్పినప్పుడు, “సరే మీ ఇష్టం. నేనైతే ఆ డబ్బంతా ప్రభుత్వ ధనాగారంలోనే చేరాలని భావిస్తాను” అన్నారు. మహనీయ ఉమర్(రజి)లోని న్యాయశీలతకు, నిష్పక్షపాత బుద్ధికి ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే.



# అరబ్బుల ప్రత్యేకతలు-2

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

## బుద్ధికుశలతలో సాటిలేనివారు

వారు చదువురానివారే, అక్షరాభ్యాసం చేయనివారే అయినప్పటికీ బుద్ధివివేకాలు, ప్రజ్ఞాపాటవాలు వారికి దేవుని తరఫున ప్రసాదించ బడిన విలువైన కానుకలు. మహనీయ అబూబకర్(రజి), ఉమర్ ఫారూఖ్, ఉస్మానె గనీ, అలీ ముర్తుజా, తల్హా, జుబైర్, ఖాలిద్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర.అన్‌హుమ్) వంటి వందలాది వేలాది ప్రవక్త సహచరులు విద్యావిషయాలలో, ధార్మిక వ్యవహారాలలో నైతికతలో, రాజకీయాలలో స్ఫురద్రూపులని చరిత్ర నిరూపించింది. రోము, పారసీక చక్రవర్తులతో వారు నెరపిన దౌత్యం, ఉత్తర ప్రత్యుత్తరాలను, చిక్కుముడులను చాకచక్యంగా విప్పటంలో వారు ప్రదర్శించిన తెలివిడిని చూసినపుడు మహా మేధావులనే వారు వెనక్కి నెట్టేశారని అనిపిస్తుంది. వారి కవుల కవనాన్ని, వారి వక్తల ఉపన్యాసాలను, వారి సాహితీపరుల వచనాలను విన్నప్పుడు వారి సహజ సామర్థ్యం ఎటువంటిదో అవగతం అవుతుంది.

## వారి జ్ఞాపకశక్తి అసాధారణం

జ్ఞాపకశక్తి అరబ్బులకు దేవుడిచ్చిన ప్రత్యేక వరం అనాలి. వారు నిరక్షరాస్యులే. ఒక రంగంలో వారికి ప్రవేశం లేని మాట నిజమే. కాని వారి ఈ శక్తి ఇతర రంగాలలో పూర్తిగా వెచ్చించబడింది. అందువల్లనే వారిలోని కవులు పెద్ద పెద్ద ప్రబంధాలను, కీర్తనలను కంఠపాఠం చేసుకుని అప్పజెప్పేవారు. వారిలోని చాలా మంది ఖుర్‌ఆన్‌ను వ్రాసుకోకపోయినప్పటికీ - పెద్దపెద్ద సూరాలను కంఠస్థం చేసుకుని అప్పజెప్పేవారు. కొంతమందైతే పూర్తి ఖుర్‌ఆన్ సంస్మర్తలుగా కీర్తి గడించారు. వారి అడుగు జాడలలోనే ప్రపంచంలోని వివిధ దేశాలలో వేలాది, లక్షలాది మంది 'హుఫ్ఫాజ్'లుగా దివ్య ఖుర్‌ఆన్‌ను తమ మనోఫలకాలపై భద్రపరచుకున్నారు. అరబ్బులలోని ఈ విశిష్ట గుణం ఒక్క ఖుర్‌ఆన్‌కే పరిమితం కాలేదు. హదీసులు, సియర్, సంఘటనల ఓ పెద్ద భాగం గ్రంథస్థం అవటంతోపాటు కంఠస్థం కూడా అయింది. అవి ఒకరి నోట మరొకరికి, వారి ద్వారా ఇంకొకరికి ... అలా చేరుతూ ఉండేవి. కొన్ని వేలు కాదు, లక్షలాది హదీసులను పొల్లుపోకుండా జ్ఞాపకం ఉంచుకున్న సహాబీలు వందలాది మంది ఉండేవారు. అరబ్బులలోని ఈ ప్రత్యేక గుణాలే ఇస్లాంను పరిరక్షించటంలో, వ్యాపింపజేయటంలో కీలక పాత్ర వహించాయి.

## ఉదార స్వభావులు

అరబ్బులలోని ఒక విశిష్ట గుణం వారి ఔదార్యం, దాతృత్వం. అతిథి మర్యాదలో వారు సాటిలేనివారు. తమను నమ్ముకుని ఆశ్రయం కోరిన వారి రక్షణ కోసం ప్రాణాలకు సైతం తెగించేవారు. కీర్తి ప్రతిష్ఠల కోసం లెక్కలేకుండా ఒంటెల్ని కోసి విందు భోజనాలు చేయించేవారు. ఆఖరికి జూదంలో గెలిచిన ఒంటెల్ని కూడా విందు భోజనాలకు కేటాయించేవారు. ఆ విధంగా

సంతర్పణ చేసి, తమ ఔదార్యంపై గర్వపడేవారు. వారి కవిత్వంలో కూడా ఈ ప్రదర్శనాబుద్ధి తొణికిసలాడుతూ ఉండేది. ఇస్లాం వచ్చిన తరువాత అరబ్బులలోని ఈ ఔదార్యాన్ని సంస్కరించి, 'దైవ ప్రసన్నత కోసం దైవమార్గంలో ఖర్చుపెట్టమని' ప్రబోధించింది. తత్ఫలితంగా వారు అవసరమైనప్పుడే, అవసరార్థుల కోసం ఖర్చుపెట్టడం నేర్చుకున్నారు. సముదాయాలపై ఆపదలు, విపత్తులు వచ్చిపడినప్పుడు వారు లెక్కలేకుండా డబ్బు ఖర్చుపెట్టేవారు.

## సమానత్వాన్ని ఇష్టపడేవారు

వారు ఏనాడూ ఏ జాతికీ లోబడి ఉండలేదు. ఏ నిరంకుశ చక్రవర్తికీ వత్తాసు పలకలేదు. అందువల్ల వారిలో స్వాభిమానం, పౌరుషం మేల్కొని ఉండేవి. ఒకరికి బానిసలుగా ఉండటాన్ని వారు ఇష్టపడేవారు కారు. తమ్ము తాము అవమానపరచుకోవడాన్ని వారు సహించేవారు కారు. ఎంతటి వారైనాసరే వారికి ఎదురుగా కూర్చొని కళ్లల్లో కళ్లు పెట్టి మాట్లాడటానికే వారు ఇష్టపడేవారు.

అరబ్బులలో మొదలైన అనేక యుద్ధాలకు ప్రధాన కారణం ఈ స్వాభిమాన పరిరక్షణే. అరబ్బులలోని సత్యాన్ని చాటే ఈ స్వభావం, సమానత్వ భావం, ప్రజాస్వామిక భావనలే ఇస్లామీయ ప్రబోధనల పరివ్యాప్తిలో దోహదకారి అయ్యాయి.

## క్రియాత్మక నడవడి

అరబ్బుల స్వాభావిక, నైతిక నడవడిలోని ఆఖరి ఘట్టమిది. వారు స్వతహాగా క్రియాశీలురు. క్రియాత్మకతను ఇష్టపడేవారు. వారు ఈరానీయులు, భారతీయుల వలె సిద్ధాంతాలలో, భావనా జగతిలో ఓలలాడేవారు కారు. వారిది మూర్తీభవించిన ఆచరణ. ఆచరణనే వారు ప్రేమించేవారు. ఎందుకు? ఏమిటి? ఎలా? లాంటి సంశయాలకు దూరంగా ఉండేవారు. వారు ప్రపంచంలో వర్తకుల, సిపాయిల మాదిరిగా కొన్ని మంచి మాటల్ని విని, వాటిని స్వీకరించి ఆచరణలో పెట్టేవారు. ఈ కారణంగానే వారు అరబ్బేతరుల వలె మీనమేషాలు లెక్కించటంలో, వెంట్రుక తోలు వలచి లేనిపోని చిక్కులలో పడటంలో సమయాన్ని వృధా చేయలేదు. వారు ఆపాదమస్తకం ఆచరణ. అందుచేతనే అంతిమ దైవప్రవక్త (స) వారి ముందు ఆచరణాత్మక జీవన విధానాన్ని పెట్టి, వారిని నిలువెల్లా క్రియాశీలురుగా మలిచారు. వారు నేర్చుకున్న దానిని చిత్తశుద్ధితో ఆచరణలో పెట్టి, కేవలం కొన్నేండ్లలోనే దాని నమూనాను లోకానికి పరిచయం చేశారు. దూరప్రాంతాల నుంచి అరేబియాలో పల్లెటూరి బైతులు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చేవారు. వారు సందేహాల స్వాములుగా, అనుమానాల అయ్యలుగా వ్యవహరించకుండా, అనవసరపు మాటల్లో సమయాన్ని వృధా చేయకుండా తమ విధులు బాధ్యతలను అడిగి తెలుసుకునేవారు. నీతీ నడవడికలను గురించి ప్రశ్నించేవారు. ఆ తరువాత తమ తెగ వారి వద్దకు వెళ్ళి, తమ క్రియాత్మక సందేశం ద్వారా తమ తెగ వారందరినీ ముస్లింలుగా మార్చేసేవారు. అయితే గీతే, సాధ్యాసాధ్యాల గురించి చర్చను సాగదీసేవారు కాదు. వారు 'ప్రబోధన'ను తరచి చూసేవారు. శ్రద్ధగా వినేవారు. దానిపై చెక్కుచెదరని విశ్వాసంతో ముందుకు సాగేవారు. అరబ్బులలోని ఈ సీదాసాదా నైజమే వారిని ధర్మానికి అంటిపెట్టుకుని ఉండేలా చేసింది. అరబ్బేతర ఫిలాసఫీల నుండి, చర్చాగోష్టుల నుండి వారిని వేరుగా ఉంచింది. కేవలం కొన్ని సంవత్సరాలలోనే వారి ద్వారా ప్రాక్ పశ్చిమాలలో, ఉత్తర దక్షిణాలలో ఇస్లామీయ విజయ కేతనం రెపరెపలాడింది.

## ఈ సుగుణాల వెనుకనున్న పరమార్థం

అరబ్బులలోని ఈ సహజమైన లక్షణాలను, నీతీ నడవడికలను చూసినప్పుడు, అల్లాహ్ తన చివరి జీవన సంవిధాన పరివ్యాప్తికి, రక్షణకు ఏ జాతిని ప్రత్యేకంగా ఎంపిక చేశాడో, అది ఆది నుండే దాని కొరకు ఎన్నుకోబడిందని నమ్మవలసి ఉంటుంది. వారిలో అన్ని రకాల అపమార్గాలు, అపసవ్యతలు ఉన్నప్పటికీ కొన్ని ప్రత్యేక గుణాలు కూడా వారిలో పొందుపరచబడ్డాయి- ఎందుకంటే దేవుని రాజ్యం నెలకొనే రోజు వచ్చినప్పుడు వారిలోని ఈ సహజ సామర్థ్యం వారికి సహాయకారి కావాలని. అంటే అన్యులలో లేని 'మూలధనం' అరబ్బులలో ఉండింది. అందుకే అల్లాహ్ తన చిట్టచివరి దైవదౌత్యం కొరకు ఈ జాతినే ఎంపిక చేసుకున్నాడు. ఈ సొత్తును వారికే అప్పగించాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఒకసారి ఇలా అన్నారు : "అల్లాహ్ ఇబ్రాహీం సంతతిలో ఇస్మాయీల్‌ను ఇష్టపడ్డాడు. ఇస్మాయీల్ సంతతిలో బనీ కనానాను ఇష్టపడ్డాడు. బనీ కనానాలో ఖురైష్‌ను ఇష్టపడ్డాడు. వారిలో బనూ హాషిమ్‌ను. బనూ హాషిమ్‌లో నుండి నన్ను ఇష్టపడ్డాడు." వేరొక ఉల్లేఖనం ప్రకారం ఆయన (స) ఇలా వక్కాణించారు: "నేను అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు అబ్దుల్లాహ్ పుత్రుడను. అల్లాహ్ జనులందరినీ పుట్టించినప్పుడు నన్ను ఆయన వారందరిలోకీ శ్రేష్ఠమైన సంతతిలో ఉంచాడు. వారిని రెండు భాగాలుగా (అరబ్బులుగా, అజమీలుగా) విభజించినపుడు నన్ను ఉత్తమమైన భాగం (అరబ్బుల)లో నుండి చేశాడు. మరి ఆ భాగాన్ని కూడా తెగలుగా విభజించినప్పుడు, నన్ను అత్యుత్తమమైన తెగలో పుట్టించాడు. మరి ఆ తెగను వంశాలుగా విభజించినప్పుడు నన్ను అన్నిటికన్నా ఉత్తమమయిన వంశంలో పుట్టించాడు. ఆ వంశాన్ని వ్యక్తులుగా విభజించినప్పుడు, నన్ను ఆ వంశంలో అందరికన్నా ఉత్తమునిగా చేశాడు." (ఈ రెండు హదీసులు 'తిర్మిజీ'లోని బాబుల్ మనాఖిబ్‌లోనివి).

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వి-రహ్మా- విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

'చరితార్థులు'-2



# నవాబ్ అలీ బహదూర్

(1835-1873)

29




**ప్రథమ** భారత స్వాతంత్య్ర సంగ్రామంలో భాగంగా ఆంగ్లేయుల పెత్తనాన్ని యావగించుకుంటు తాను ఉద్యమించడం మాత్రమే కాకుండా సహచర యోధులు తాంతియా తోపే, ఝాన్సీరాణి లక్ష్మీబాయిలకు కూడా తన అంగబలంతో సహకరించిన నవాబ్ అలీ బహదూర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బుందేల్ ఖండ్ ప్రాంతానికి చెందిన బండ సంస్థానంలో 1835లో జన్మించారు. ఆంగ్లేయులు తమ సంస్థానం, స్వజనం మీద చలాయిస్తున్న పెత్తనాన్ని పిన్న వయస్సు నుండి నిరసిస్తూ వచ్చిన అలీ బహదూర్ 1857నాటి స్వాతంత్య్ర సంగ్రామం అందించిన స్ఫూర్తితో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులను తన బండ సంస్థానం నుండి వెళ్ళగొట్టి జూన్ 14, 1857 నుండి స్వయంపాలన చేపట్టారు. ఆయన చర్యల్ని హర్షించిన ప్రజలు 'సంస్థానం మనది...ఆదేశాలు నవాబువి' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తాను ధ్వజమెత్తడం మాత్రమే కాకుండా అలీ బహుదూర్ ఇతర సంస్థానాధీశులను కూడా ఆ దిశగా ఉత్తేజపర్చడానికి ప్రయత్నిం చారు. ఆంగ్లేయులతో పోరాటానికి సిద్ధపడిన ఝాన్సీరాణి లక్ష్మీబాయి తనకు ఆయుధ-అంగబలాన్ని అందించాల్సిందిగా కోరుతూ గ్వాలియర్ సంస్థానాధీశులు సింధియాకు లేఖ రాసారు. ఆమె వినతిని తిరస్కరించిన సింధియా సంస్థానాధీశుడు ఈస్ట్ ఇండియా కంపెనీ పక్షాన చేరాడు. ఆ తరువాత ఆమె సహకారం అర్థిస్తూ బండా నవాబ్ అలీ బహుదూర్‌కు లేఖ పంపారు. అలీ బహుదూర్‌ను తన సోదరునిగా భావిస్తూ ఆ లేఖతోపాటుగా 'రాఖీ' కూడా ఝాన్సీరాణి లక్ష్మీబాయి ఆయనకు పంపారు. ఆమె వినతికి తక్షణమే స్పందిస్తూ 1000 మంది సుశిక్షితులైన కాల్బలాన్ని, మూడు వందల గన్నర్లను ఆయన ఝాన్సీకి పంపారు. ఆ విధంగానే మరో 1000 మంది సైనికులను మరో పోరాట యోధుడు తాంతీయా తోపేకు పంపారు. ఈ విధంగా ఏడాదిపాటు సాగిన స్వతంత్ర పాలనలో, ఝాన్సీరాణి, తాంతియాలకు సహాయం అందించడం మాత్రమే కాకుండా వారితో కలిసి వ్యూహరచనలో పాల్గొన్నారు. అలీ బహుదూర్ ప్రయత్నాల వివరాలు తెలుసుకున్న ఆంగ్లేయాధికారులు ఆగ్రహావేశులై ఆయన మీద చర్యలకు ఉపక్రమించారు. జనరల్ విట్ లాక్ అపార సైనిక బలగాలతో బండా సంస్థానం మీద దాడి చేశాడు. ఆంగ్ల సైన్యాలను గోయిరా ప్రాంతంలోని ముగ్వీలీ గ్రామం వద్ద నవాబ్ అలీ బహుదూర్ సైన్యాలు అత్యంత సాహసోపేతంగా ఎదుర్కొన్న ప్పటికి పరాజయం తప్పలేదు. ఆంగ్ల సైన్యం ఖురగ్రాహ్ కోటను స్వాధీనం చేసుకుని విధ్వంసానికి పాల్పడటం మాత్రమే కాకుండా ఎనిమిది వందల మంది స్వాత్రంత్య సమరయోధులను ఊచకోత కోసింది. నవాబ్ అలీ బహుదూర్ ను అరెస్టు చేసిన ఆంగ్లేయాధికారులు ఆయనను స్వంతగడ్డ బండా నుండి దూరంగా ఉంచాలనుకున్న ఆంగ్లేయులు ఇండోర్‌కు పంపారు. చివరకు 1873లో బండా నవాబు అలీ బహదూర్ ఇండోర్‌లో కన్నుమూశారు. ✤




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




**(ఆంధ్రజ్యోతి శనివారం 16, డిసెంబర్ 2023లో చరిత్రకారుడు రామచంద్ర గుహ రాసిన వ్యాసం నుంచి)**

**రాజకీయ** చర్చల్లో మారుతున్న భాష విషయమై రచయిత పరకాల ప్రభాకర్ ఇటీవల బెంగళూరులో వెలువరించిన ఒక ప్రసంగంలో నిశిత పర్యాలోకనం చేశారు. 1980 దశకం తుదినాళ్లలో భారతీయ జనతా పార్టీ దేశ రాజకీయాలలో ప్రప్రథమంగా ఒక ప్రముఖ శక్తిగా ప్రభవించింది. తాను 'వాస్తవిక లౌకికవాదం'కు మద్దతుగా నిలబడతానని ఆ పార్టీ నాయకుడు లాల్ కృష్ణ ఆడ్వాణీ అప్పట్లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఒక బూటకపు లౌకిక వాదాన్ని ఔదలదాల్చిందని, తాను విశ్వసిస్తున్న లౌకికవాదమే నిక్కమైనదని ఆయన అనేవారు. 'వాస్తవిక లౌకిక వాదం' అందరికీ న్యాయం చేస్తుందని, ఎవరినీ బుజ్జగించదని ఆడ్వాణీ స్పష్టం చేసేవారు.

గమనించారా? స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు దశాబ్దాల తరువాత కూడా లౌకిక వాదం ఒక ఆదర్శంగా ఉండేది. ఎంతగా ఉండేదంటే ఆడ్వాణీ లాంటి బీజేపీ నాయకులు సైతం విశ్వసనీయమైన లౌకికవాదానికి మార్గదర్శకులుగా తమను తాము పదే పదే చెప్పుకోవడం జరిగేది. ఇప్పుడో? బీజేపీలో గానీ, కాంగ్రెస్‌లో గానీ ఏ ప్రధాన నాయకుడూ బహిరంగంగా లౌకికవాదాన్ని అంగీకరించడం లేదు. పైగా తామే నిజమైన హిందువులమని పదే పదే చెప్పుకుంటున్నారు. అధికార పక్షం రాజకీయాలను వ్యతిరేకించడంలో రాహుల్ గాంధీ తాను అనుసరిస్తున్నదే నిజమైన హిందూ ధర్మమని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రబోధించే హిందూ ధర్మం కృత్రిమమైనదని నొక్కి చెబుతున్నారు. హిందూ మతానికి బహిరంగంగా విధేయత ప్రకటించడాన్ని రాహుల్ సలహాదారులు పూర్తిగా సమర్థిస్తున్నారు. రాహుల్ ఒక 'శివ భక్తుడు' అని, 'జంధ్యం ధరించే' హిందువు అని ఉద్ఘోషిస్తున్నారు.

లౌకిక వాదంపై చర్చ ప్రగతిశీలంగా పరిణమించిందా? లేదు. ఎక్కడ మొదలయిందో అక్కడే అంతమయిందని పరకాల ప్రభాకర్ స్పష్టం చేశారు. ఒకప్పుడు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లోని తమ వ్యతిరేకుల కంటే తామే నిజమైన లౌకికవాదులమని చెప్పుకోవడానికి ఆరాటపడేవారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీలోని తమ ప్రత్యర్థుల కంటే తామే అత్యంత శ్రద్ధాళువులయిన హిందువులమని చాటుకోవడానికి నిరంతరం

ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అనుసరించిన ప్రచార వ్యూహమే ఇందుకొక నిదర్శనం. కాంగ్రెస్ నేత కమల్‌నాథ్, అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి కంటే నిష్ఠాగరిష్ఠుడైన హిందువు అని ప్రచారం చేశారు.

రాజకీయ చర్చల హైందవీకరణ ఇటీవలి సంవత్సరాలలో మరింత ప్రగాఢమయింది. అయోధ్యలో రామాలయం ప్రారంభమయిన తరువాత అది మరింతగా పటిష్ఠమవుతుంది. ఆ మహా ప్రారంభోత్సవం బీజేపీకి ఒక మహా విజయంగా వేడుక చేస్తారనడంలో సందేహం లేదు. అయితే తామూ 'లౌకికవాద' పార్టీలమని చెప్పుకునే రాజకీయ పక్షాలు కూడా ఆ ఆలయో త్సవాన్ని సమధికోత్సాహంతో స్వాగతిస్తున్నాయి! నరేంద్ర మోదీ మెప్పు పొందడానికి ఉత్సాహపడుతున్న వివిధ చిన్న పార్టీలు ఈ విషయంలో మరింత ఉత్సాహాన్ని చూపుతున్నాయి. కర్ణాటకలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న అనంతరం జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు హెచ్.డి.కుమారస్వామి తన ఉపన్యాసాలను 'జై శ్రీరామ్' నినాదంతో ముగిస్తున్నారు మరి. నేనీ కాలమ్ రాస్తున్న సమయంలోనే భారత్ రాష్ట్ర సమితి నాయకురాలు కవిత ఒక ట్వీట్ పోస్ట్ చేశారు. 'అయోధ్యలో రామాలయ నిర్మాణం కోట్లాది హిందువుల స్వప్నాలను సాకారం చేసిందని' ఆమె ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కొత్త సంవత్సరం తొలి నెలలో ప్రారంభమవనున్న ఆ నూతన మహా రామ మందిరం ఈ దేశానికి ఎటువంటి భవిష్యత్తును సూచిస్తుంది? ఒక 'ద్వితీయ రిపబ్లిక్'ను సృష్టించేందుకు భారత్ సంసిద్ధతను ఆ కొత్త ఆలయం చూపుతుందని ఒక స్నేహితుడు సూచించాడు. ఆ నూతన రిపబ్లిక్ సర్వత్రా, సర్వదా హిందువులకు తొలి, మలి, తుది ప్రాధాన్యమిచ్చే రాజ్య తంత్రానికి, విధాన రూపకల్పనకు నిబద్ధమవుతుంది. ఆ విధంగా అది 1950 రాజ్యాంగం (దేశ పౌరులలో అత్యధికుల మత విశ్వాసాల ప్రాతిపదికన యుగ ధర్మాన్ని, జాతిశీలతను నిర్వచించేందుకు వివేకవంతంగా నిరాకరించిన మహోన్నత మౌలిక శాసనం) వ్యవస్థాపించిన, ప్రస్తుతమున్న 'ప్రథమ రిపబ్లిక్'ను రద్దు చేస్తుంది.

ఈ దిశగా అధికార పక్షం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నట్టు గత పది సంవత్సరాలలో చోటు చేసుకున్న సంఘటనలు సూచిస్తున్నాయి. ప్రతిపక్షాలూ చాల వరకు ఆ ప్రయత్నాలలో పాలుపంచుకుంటున్నాయి! అయోధ్యలో రామాలయ నిర్మాణంలో ప్రభుత్వం పాల్గొనడం భారత్ అన్నిటికీ మించి ఒక 'హిందూ' దేశమన్న భావనను బలపరుస్తోంది. 'రిపబ్లిక్' అనే పదాన్ని ఉపయోగిస్తున్నప్పుడు ఒక హెచ్చరిక కూడా చేయవలసివుంది. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి మతపరమైన ఆచారాలను నిర్వర్తించడంలో ముఖ్య పాత్ర వహించిన ప్రధానమంత్రి రాచరిక రీతిలో వ్యవహరించారు. ఇది అయోధ్య ఆలయానికే పరిమితం కాదు. 2021 డిసెంబర్‌లో వారణాసిలో నరేంద్రమోదీ కొన్ని మతపరమైన క్రతువులు నిర్వహించారు. ఆ సమయంలో పూజారులు ముక్తకంఠంతో 'రాజా సాహెబ్‌కి జై' అని కీర్తి గానం చేశారు. మోదీ రాచరిక ఆకాంక్షలు పార్లమెంటు కొత్త భవన ప్రారంభోత్సవంలో మోదీ రాచరిక ఆకాంక్షలు మరింతగా ప్రదర్శితమయ్యాయి. సమస్త భారతీయుల సంకల్పానికి ప్రాతినిధ్యం వహించే ఆ సమున్నత శాసన నిర్మాణ సౌధంలో మోదీ ఒక చక్రవర్తిగా ప్రవర్తించారు.

భారత్‌లో నేడు సంభవిస్తున్న పరిణామాలను ఎలా అర్థం చేసుకోవాలి? మన ఇరుగుపొరుగున ఉన్న దేశాలలోని పరిస్థితులతో పోల్చి చూడడం అందుకు బాగా ఉపకరిస్తుంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు తమను తాము ఇస్లామిక్ రాజ్యాలుగా ప్రకటించుకున్నాయి. ఆ రెండు దేశాలలోనూ హిందువులు, క్రైస్తవులను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారు. శ్రీలంక, మయన్మార్‌లు తమను తాము బౌద్ధ దేశాలుగా ప్రకటించుకున్నాయి. ఈ రెండు దేశాలలోను మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ప్రేరేపిత హింసాకాండ చెలరేగుతోంది. ఒకప్పుడు మతాన్ని, రాజ్య వ్యవస్థ నుంచి పూర్తిగా వేరు చేసిన భారత్ ఇప్పుడు ఈ దక్షిణాసియా క్లబ్‌లో చేరింది! మన రాజకీయాలు, విధానాల రూపకల్పనను మరింత హిందూ కేంద్రితంగా చేయడం భారత్ పురోభివృద్ధికి తోడ్పడుతుందా? ప్రపంచంలో మనది ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ అని మన నాయకులు గొప్పగా చెబుతుంటారు. అయితే తలసరి ఆదాయం, శిశుమరణాల రేటు, కార్మిక శ్రేణులలో మహిళల శాతం మొదలైన సూచీల ఆధారంగా చూస్తే మన దేశం చాలా తక్కువ స్థానంలో ఉంది. సమగ్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధి పరంగా చూస్తే ఆసియాలో జపాన్, సింగపూర్, దక్షిణ కొరియాలు అగ్రగాములుగా ఉన్నాయి. జపాన్, దక్షిణ కొరియా సముచితమైన ప్రజాస్వామిక దేశాలు. సింగపూర్ పాక్షికంగా మాత్రమే ప్రజాస్వామిక రాజ్యం. ఈ మూడు దేశాలలోనూ రాజకీయాలు, ప్రజాజీవితంలో మతం పాత్రను కఠినంగా అణచివేశారు. అయోధ్యలో కొత్త ఆలయ ప్రారంభోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు సకల రాజకీయ పార్టీల నేతలూ మహోత్సాహపడుతున్న ప్రస్తుత సందర్భంలో ఆ మూడు ఆసియా దేశాల ప్రజా జీవితంలో కొట్టొచ్చినట్టు కన్పించే వాస్తవం మన రాజకీయుల తీరుతెన్నులపై నిశితంగా ఆలోచించేందుకు మనలను పురిగొల్పాలి.



# ఇస్లాము అంటే...

కవి కరీముల్లా

**ఇప్పుడు** ప్రపంచం మొత్తం మీద ఓ చర్చ చాలా ఆసక్తికరంగా జరుగుతుంది. అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్పై జరిగిన సెప్టెంబర్ 11 దాడుల తర్వాత ఈ చర్చకు ఇస్లామ్ కేంద్ర బిందువయ్యింది. దాదాపు అన్ని అన్యమతాలకు చెందిన వారిలోనూ ఇస్లామ్ పట్ల అనేక అనుమానాలు నెలకొన్నాయి. ముస్లింలు హింసావాదులా? అసలు ఇస్లామ్ అంటే ఏమిటి?అనే ప్రశ్నలు జగత్తులో ఊహాగానాలు చేస్తున్నాయి. ఇలాంటి అసహజమైన, అసాంఘీకమైన వాతావరణం నెలకొనడంలో పాశ్చాత్య మీడియా, హిందూత్వ మీడియా ప్రముఖ పాత్ర వహించిందనటంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇలాంటి విషయాలను విశ్లేషించుకునేందుకు ఇస్లామ్ వాస్తవిక రూపాన్ని తెల్సుకోవాల్సిన అవసరం వుంది. టెర్రరిజం స్వరూప స్వభావాలను అవగాహన చేసుకోవాల్సి వుంది.

నిజానికి ఇస్లామ్ ఓ మతం కాదు. జీవన మార్గం. ఇస్లామ్ అంటేనే శాంతి, సన్మార్గం, దైవానికి కట్టుబడి వుండటం అనే అర్థాలు వస్తాయి. అశాంతి నిండిన మనసుల్లో, సమాజాల్లో ఇస్లామ్ శాంతిని స్థాపించటానికి వచ్చింది. హింసకు నిలయమైన వ్యవస్థలో అహింసను ప్రేరేపించటానికి వచ్చింది. ఇస్లామ్ మానవులందరి మధ్య ప్రేమను పంచటానికి వచ్చింది. అంతేకాని అన్యమతస్థులపై కత్తులు దూయటానికి రాలేదు. ప్రాథమికంగా ఇస్లామ్ మానవులంతా పరస్పరం సోదరులేనని బోధిస్తుంది. ఏ కులానికి, మతానికి, ప్రాంతానికి, భాషకు చెందినవారైనా అందరూ ఒక్కటేనన్న విశ్వజనీన భావనను మానవ హృదయాల్లో నాటుతుంది. పవిత్ర ఖుర్ఆన్లో ఓ చోట.

“మానవులారా నిస్సందేహంగా మేము మిమ్మల్ని ఒకే జంట ద్వారా సృష్టించాము” అని వుంది. దీనిని బట్టి మనకు తెలిసేదేమంటే దివ్య ఖుర్ఆన్పై విశ్వాసమున్న ప్రతి విశ్వాసి సర్వ మానవులపై ప్రేమను కలిగి వుండటం, మానవులంతా ఒకటేనన్న భావన కలిగి వుండటం తప్పనిసరి అవుతుంది. అంతేకాదు ఇస్లామ్ మానవాళిలో గొప్ప ప్రజాస్వామ్య, లౌకిక దృక్పథానికి పునాదులు వేసింది. అన్యమతస్థులపై దాడులు చేయటానికి ఇస్లాం అంగీకరించదు.ఇస్లామ్ అంటే టెర్రరిజం కాదు. ఇస్లాం అంటే శాంతి.

ఆ సర్వ సృష్టికర్త ప్రసాదితమైన ప్రకృతి సర్వమానవుల పట్ల సమభావాన్ని కలిగి వున్నప్పుడు ఎవరిపట్లనైనా ద్వేషాన్ని కలిగి వుండే అధికారం మనిషికి ఎవరిచ్చారు? సత్యం ఆధారంగా తప్ప ఏ ప్రాణాన్ని హతమార్చరాదని ఆయన పవిత్ర గ్రంథం ఖుర్ఆన్లో బోధిస్తున్నప్పుడు జాతి పేరుతోనో, కులం పేరుతోనో, మతం పేరుతోనో, భాష లేదా ప్రాంతం పేరుతోనో హతమార్చే అధికారం ఎవరికీలేదు. మక్కావాసుల చేత అతిక్రూరంగా అవమానించబడ్డ, హింసించబడ్డ మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై ప్రేమను కురిపించారు. చివరికి తనకు అత్యంత ప్రియమైన బాబాయిని

చంపి ఆయన కాలేయాన్ని నమిలిన వారిని సైతం వారు తనకు దొరికినప్పుడు అన్ని అధికారాలు వున్నప్పటికీ క్షమించి వదిలేశారు. ఆయన ఈ క్షమాగుణమే, ప్రేమ మార్గమే మొత్తం అరబ్బు ఖండాన్ని జయించింది. ఆయన(స) సహచరులు సక్రమమైన మార్గంలో నడిచారు కనుకే సూర్య కిరణాలు తాకిన ప్రతి నేలను ఇస్లాం కిరణాలు స్పృశించగలిగాయి. ఖలీఫాల కాలంలో ఏదైనా ఒక కాలిబాట ముళ్ళు, రాళ్లు, రప్పలు లేకుండా శుభ్రంగా వుంటే ఆ దారి వెంట నడిచే యూదులు, క్రైస్తవులు ఇది ముస్లింలు చేసిన పనేనని, బాటసారులకు అసౌకర్యం కలగకుండా వారు మాత్రమే ఇలాంటి సేవలు చేస్తారని అనుకునే వారు. ఈ రోజు ఎక్కడ బాంబు పేలినా, ఎక్కడ విమానం కూలినా ముస్లింలనే దోషులుగా చూపుతున్నారు. దీనికి కారణం ముస్లింలను పీడనకు గురి చేస్తున్న వారు కావచ్చు లేదా పీడనకు ప్రతిఘటనగా హింసే ఆయుధంగా మలుచు కున్న దారి తప్పిన టెర్రరిజమే కారణం కావచ్చు. కారణాలు ఏవైనా నష్టపోతుంది మాత్రం సామాన్య ప్రజానీకం.

సమాజంలో ముస్లిమ్ ప్రవర్తన ఏవిధంగా వుండాలో మహా ప్రవక్త ముహమ్మద్ (స) వివరించారు.

“నీ పై దౌర్జన్యానికి పాల్పడిన వారిని క్షమించు, నీ పట్ల చెడుగా వ్యవహరించే వారి పట్ల మంచిగా వ్యవహరించు.”

మక్కాలో దౌర్జన్యపరుల దౌర్జన్యం శ్రుతి మించినపుడు కూడా ప్రవక్త(స) సహనాన్నే బోధించారు.

“ఓ అలీ యాసిర్ (యాసిర్ సంతానమా) సహనం వహించండి. నిస్సందేహంగా మీ నివాసం స్వర్గం.”

మహాప్రవక్త(స) అనుసరించిన ఈ విధానం ప్రవక్త(స) సహనశీలతను, దూరదృష్టిని, బుద్ధి కుశలతను, సందేశ వ్యాప్తి పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఇస్లామ్‌లోని ఈ స్వభావాన్ని అర్థం చేసుకోవడంలోనే నేడు ముస్లింలు విఫలమౌతున్నారు. ఈ వైఫల్యం లోంచే కొంతమంది దారితప్పిన యువకులు నిరాశా నిస్పృహలకు గురౌతున్నారు. ఇది సరియైన విధానం కాదు. “మలినాన్ని మలినంతో శుద్ధిపరచలేము” - మహాప్రవక్త ముహమ్మద్ (స)

పై మాటను బట్టి మనకర్థమయ్యే విషయం ఇస్లామ్ ద్వేషానికి సమాధానం ద్వేషం కాదని చెప్తుంది. ఇస్లామ్ ప్రేమను నిర్మిస్తుంది. అనాథల పట్ల, వితంతువుల పట్ల, పొరుగువారి పట్ల, చివరికి మహా శక్తివంతుడైన దైవం పట్ల అవ్యాజ్యమైన ప్రేమను కలిగివుండేలా మానవుడ్ని సంస్కరిస్తుంది. ఇస్లామ్లో నిగూఢమైన ఈ అనంతమైన శక్తి ముందు కత్తికట్టిన ఎన్నో కరవాలాలు కూలిపోయాయి. ఎన్నో సామ్రాజ్యాలు తలలు వంచాయి. అపారశక్తివంతమైన మంగోలియన్ సైనిక శక్తి సైతం ముస్లిమ్లపై దాడి చేసి లక్షలమందిని హతమార్చగలిగింది కాని ఇస్లామ్ నైతిక శక్తి ముందు ఓడిపోయి వినయంతో ఇస్లాం స్వీకరించింది. శాంతి, ప్రేమ, సహనం, సేవ, సౌశీల్యం అనే పునాదుల పైనే ఇస్లాం సౌధం నిలబడి వుంది. అంతేకాని హింస, ద్వేషం, టెర్రరిజం అనే మతిమాలిన విషయాలపై కాదు.


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని ‘Geeturai Weekly’
పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




# యుద్ధం అనర్థదాయకం

- గీటురాయి డెస్క్

**గాజా**పై ఇజ్రాయిల్ యుద్ధం విధ్వంసాన్ని సృష్టించింది. ఈ యుద్ధం విస్తరిస్తే మరింత ప్రమాదమని పలువురు విశ్లేషిస్తున్నారు. యుద్ధం విషాదాన్నే మిగులుస్తుంది. ప్రముఖ శాస్త్రవేత్త అయిన్‌స్టీన్‌ను "మూడవ ప్రపంచ యుద్ధంలో ఎలాంటి ఆయుధాలు వాడతారో చెప్పగలరా" అని ఎవరో ప్రశ్నించారట. దానికాయన "నేను ఖచ్చితంగా చెప్పలేను కాని ఒకటి మాత్రం ఖాయం- మూడవ ప్రపంచ యుద్ధం ఎలాంటి ఆయుధాలతో జరిగినా, నాల్గవ ప్రపంచ యుద్ధమంటూ మాత్రం జరిగితే రాళ్ళ వంటి ఆటవిక ఆయుధాలతో జరిగి తీరుతుందని ఖచ్చితంగా చెప్పగల"నని చెప్పారట. ఇందులో ఉన్న భయంకరమైన నగ్న సత్యాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఐక్యరాజ్యసమితి 35వ సమావేశంలో నాటి ఐ.రా.స ప్రధాన కార్యదర్శి కర్ట్ వాల్డీమ్ ఓ ప్రత్యేక నివేదికను సమర్పించాడు. అణుయుద్ధం మానవ నాగరికతకే తీవ్రమైన ముప్పని, ఇప్పటికే ప్రపంచంలో 40వేల అణ్వాయుధాలు ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. అంటే హిరోషిమా (జపాన్)పై వేసిన అణుబాంబు వంటి 10లక్షల హిరోషిమా బాంబులతో సమానమట. ఈ 10లక్షల బాంబులలో అమెరికా ఆయుధ కర్మాగారాల్లోనే 6 లక్షల "హిరోషిమా" బాంబులు ఉన్నాయి. వీటిని బట్టి చూస్తే మన భూగోళమే ఒక బాంబులా గోచరిస్తుంది.

మన ప్రపంచ యుద్ధ చరిత్రను తెరచి చూసినట్లయితే జరిగిన ప్రాణనష్టం, వస్తు నష్టం, మిగిల్చిన విషాద దృశ్యాలు కానవస్తాయి. ఒక స్విడ్జర్ లాండ్ శాస్త్రవేత్త అభిప్రాయం ప్రకారం గత 5,500 సంవత్సరాలలో జరిగిన చిన్నా పెద్దా యుద్ధాల సంఖ్య 14వేలు. మరణించిన ప్రజల సంఖ్య 364 కోట్లు. నష్టమయిన ఆస్తి విలువ ఒక కోటి కోట్లు ముఖ్యంగా ఈ యుద్ధాలకు కారణం శ్రీశ్రీ అన్నట్లుగా 'ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం'గా గోచరిస్తుంది. మొదటిది సామ్రాజ్య విస్తరణ కాంక్ష, రెండవది ఒక దేశం మరో దేశాన్ని ఆర్థికంగా దోచుకోవడం. ఈ రెండు కారణాలు ముఖ్యంగా యుద్ధాలకు నాంది పలుకుతున్నాయి. యుద్ధంలో పాల్గొనే దేశాలు ఏవేవో కారణాలు చెపుతాయి అవి కేవలం పైపై మాటలు మాత్రమే.

సామ్రాజ్యవాద దేశాల మధ్య గల వైరుధ్యాల ఫలితంగా ముఖ్యంగా జర్మన్ సామ్రాజ్య వాదుల మూలంగా మొదటి ప్రపంచ యుద్ధం తలెత్తింది. ఈ యుద్ధం 1914 జులై 28న ప్రారంభమై, జర్మన్ సైన్యాలు ఓడిపోవడంతో 1918 నవంబరు 11తో ముగిసింది. ఈ యుద్ధంలో వివిధ దేశాల నుండి 6 కోట్ల 35 లక్షల మంది సైనికులు సమీకరించారు. అంటే సుమారు 1981 లెక్కల ప్రకారం మన ఆంధ్ర రాష్ట్ర జనాభా అంతమంది.

ఈ యుద్ధ ఫలితంగా 1 కోటి మంది చనిపోయారు. 2 కోట్ల మంది గాయపడ్డారు. 4 లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగింది.

1939 సెప్టెంబర్ 1వ తేదీన జర్మన్ సైన్యాలు హాలెండ్‌పై దాడి చేయడంతో అది రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. ఈ యుద్ధంలో 61 దేశాలు పాల్గొన్నాయి. ప్రపంచంలోని ప్రతి పది మందిలో 8 మంది ఈ దేశాలకు చెందినవారే. 40 దేశాలపై దాడులు జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో మరణించిన వారి సంఖ్య ఐదున్నర కోట్ల మంది. వీరిలో 2.70లక్షల మంది యుద్ధ రంగంలో మరణించారు. 9 కోట్ల మంది గాయపడ్డారు. ఈ యుద్ధంలో 10 కోట్ల 70 లక్షల మంది సైనికులు పాల్గొన్నారు. చివరికి జర్మన్, జపాన్ సైన్యాలు ఓడిపోవడంతో 1945 జూన్‌లో యుద్ధం అంతమయింది.

ఇంతటి మహా సంగ్రామాలు చవిచూసినప్పటికినీ యుద్ధోన్మాదం చల్లారలేదు. అగ్ని పర్వతంలా రగులుతూనే ఉంది. ప్రపంచ యుద్ధాల తరువాత ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో 150 యుద్ధాల వరకు జరిగాయి. అలాగే మధ్యప్రాచ్యంలో యుద్ధ జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. ఈ యుద్ధాల వలన 3 కోట్ల మంది ప్రజలు చనిపోయారు. అమెరికా తనకున్న సైనిక బలాహంకారంతో ఎన్నో యుద్ధాలకు నాంది పలికింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 30 సం॥లలో 215 సార్లు ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చింది.

ఈ యుద్ధాల ఫలితంగా విపరీతమైన ప్రాణనష్టం, వస్తు నాశనం సంభవించినది. కొన్ని చిన్న చిన్న దేశాలు కోలుకోలేనంతగా చితికి పోయాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది రూపాయల విలువ చేసే 6,604 వ్యాపార నౌకలు నీటిపాలయ్యాయి. జలంతర్గాముల అలజడుల వలన లెక్కకు రాని నౌకలెన్నో నీట మునిగాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో కూడా ఎంతో విలువైన నౌకలు, యుద్ధ నౌకలు మునిగిపోయాయి.

ఇటువంటి భయానక యుద్ధాల వెనుక ఎంతటి వృధా వ్యయం అవుతుందో ఒక్కసారి పరికిద్దాం! 1984 సం॥లో ప్రపంచంలోని వివిధ దేశాలు 9 లక్షల 50వేల కోట్ల రూపాయలు సైన్యం మీద ఖర్చు చేశాయి. ఈ మొత్తం ప్రపంచంలోని 50 పేద దేశాలలో నివసించే 150 కోట్ల మంది ప్రజల ఆదాయం కంటే ఎక్కువ. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే సంపదలో 30శాతం. అనుత్పాదక రంగమైన సైనిక అవసరాలకు వ్యయం చేయబడుతుంది. దాన్నిబట్టి చూస్తే మనం యుద్ధాల కోసం, ఒకర్ని ఒకరు చంపుకోవడం కోసం ఎంత వృధా వ్యయం చేస్తున్నామో అర్థమవుతుంది. పోనీ ఈ ప్రపంచ సైనిక వ్యయంలో కనీసం 10 శాతం తగ్గించినట్లయితే ప్రపంచంలో ఉన్న నిరక్షరాస్యత, అనారోగ్యం, ఆకలి చావులను అనతికాలంలో రూపుమాపవచ్చు. కనీసం ఒక్క శాతమన్నా ప్రక్కకు తీస్తే ఆ డబ్బుతో ఆకలితో అలమటిస్తున్న 20 కోట్ల మంది పిల్లలకు కడుపునిండా తిండి పెట్టవచ్చు.

అమెరికా వారు ఒక జెట్ బి-70 బాంబర్ విమానాన్ని తయారు చేయడానికి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దానికి ఖర్చు పెట్టే డబ్బుతో కొన్ని వేల మంది కుటుంబాలకు గృహ వసతిని కల్పించవచ్చు. అమెరికా ద్వితీయ ప్రపంచ యుద్ధం తర్వాత ఇప్పటివరకు 20లక్షల కోట్ల రూపాయలకు మించి ఖర్చు చేసింది. 1984లో అమెరికా సైనిక వ్యయం 2,38,600 కోట్ల రూపాయలు. 1982 నాటికి అమెరికా ప్రపంచంలోని 32 దేశాలలో 1,500 యుద్ధ స్థావరాల్లో 12వేల ఆటంబాబులతో 5 లక్షల మందిని సమకూర్చి ఉన్నది.

ఆసియా ఖండ దేశాల్లో రక్షణ వ్యయం 1995 నాటికి 13వేల కోట్ల డాలర్లకు పెరిగింది. ప్రతీ దేశం ఆయుధ సంపత్తిని పెంచు కున్నట్లుగా వినిపిస్తున్నప్పటికీ జపాన్ మాత్రం చడీచప్పుడు కాకుండా అగ్రస్థాయి సైనిక శక్తిగా బలపడుతుంది. ఆసియా దేశాల రక్షణ వ్యయం ప్రాతిపదికగా ఈ అంచనాలు వేశారు. ఈ వివరాల ప్రకారం పాకిస్తాన్, దక్షిణ కొరియా, తైవాన్, ఇండోనేషియా, తాయిలాండ్, మలేషియా, సింగపూర్, బ్రూన్ దేశాలు రక్షణ రంగంపై 1989 సంవత్సరంలో 3,500 కోట్ల డాలర్లు ఖర్చు చేశాయి. ఆసియాలో ఈ విధమైన ఆయుధ పోటీ గురించి వాషింగ్టన్ టైమ్స్ వివరిస్తూ జపాన్, చైనా, భారతదేశాలలో భవిష్యత్తులో చేపట్టే భారీ రక్షణ ప్రాజెక్టుల విషయం ప్రక్కకు పెట్టినా ప్రస్తుతం ఉన్న సైనిక వ్యయం పెరిగిపోవడం పొరుగు దేశాలలో అనుమానాలకు ఆగ్రహాలకు దారి తీస్తుంది. మన దేశానికి పొరుగున ఉన్న పాకిస్తాన్ కూడా అణుబాంబులను, అణ్వాయుధాలను తయారు చేసింది. భారత్ వద్ద 13 అణు క్షిపణులు ఉన్నట్లు కూడా పేర్కొంది. అలాగే చైనా వద్ద కూడా ఆయుధ సంపత్తి ముమ్మరంగా ఉన్నట్లు ఈ విషయంలో ఇది గతంలో సోవియెట్‌తో పోటీపడే విధంగా ఉందని కూడా వాషింగ్టన్ టైమ్స్ పేర్కొంది. ఆయుధ సంపత్తి విషయంలో ప్రపంచ దేశాలన్నింటి మధ్యా పోటీ ముమ్మరంగా సాగుతుంది.

నేడు అణుబాంబులు భయాందోళనలు కలిగిస్తున్నది. దాని ప్రచండమైన శక్తికి నిదర్శనం. రెండవ ప్రపంచ యుద్ధం ఆ సమయంలో అమెరికా, జపాన్ నగరాలు హిరోషిమా, నాగసాకీలపై

**మిగతా 34వ పేజీలో...**



# సృష్టికర్త వైపు మరలండి

**- నసీరా బేగం**

**దైవప్రవక్త(స)** ఒక ఉపమానాన్ని చూపుతూ ఇలా సెలవిచ్చారు; ఒక బాటసారి ఒంటె మీద తన ప్రయాణ సామగ్రి నంతటినీ పెట్టుకుని ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యంలో అలసి పోయిన కారణంగా ఒకచోట ఒంటె మీద నుంచి దిగి ఒక చెట్టు కింద విశ్రమించాడు. గాఢ నిద్రలో జారుకున్నాడు. ఆ తరువాత మేల్కొని చూశాడు. ఒంటె మాయమైపోయింది. అంతా వెతికాడు. కాని ఒంటె జాడ ఎక్కడా కనబడలేదు. నిరాశా నిస్పృహలకు లోనై అలసి సొలసి మళ్ళీ నిద్రలో జారుకున్నాడు. కొంతసేపటికి ఆందోళనతో మేల్కొన్నాడు. తన ఒంటె తన కళ్ళ ముందు పూర్తి సామాగ్రితో సిద్ధంగా నిలుచుని ఉంది. అప్పుడు అతను పట్టరాని సంతోషంతో ఓ అల్లాహ్ నేను నీ యజమాని, నీవు నా దాసుడు అని తడబడుతున్న పెదవులతో వ్యతిరేకంగా చెప్పేశాడు. ఒక బాటసారి ఎంతగా సంతోషించాడో, అంతకంటే ఎక్కువగా తనకు దూరంగా పోయిన భక్తుడు తిరిగి తన వైపునకురావటాన్ని ఇష్టపడ తాడు. కనుక ఈ విపత్కర కాలంలో ఆపద్బాంధువుడైన అల్లాహ్ వైపునకు మరలటమే శ్రేయస్కరం. అప్పుడే మనం ఈ కరోనా వ్యాధి నుండి తప్పకుండా విముక్తిని పొందగలము.

మనిషిపైకి ఏదైనా ఆపద వచ్చి పడినప్పుడు అతను వెంటనే ఆ ఆపదను తొలగించేవారి వైపునకు దృష్టిని సారిస్తాడు. వారి సహాయ సహకారాలను తీసుకుని గట్టెక్కుతాడు. అదేవిధంగా ఈనాడు ప్రపంచం మొత్తానికి కరోనా వ్యాధి ఆపద వచ్చింది. అది రాగానే మనిషి డాక్టర్ల వద్దకు పరుగులు పెట్టాడు. "చికిత్స ఎంత చేసినా వ్యాధి అంతగా ముదిరింది" అని చెప్పే సామెత మాదిరిగా ఈ వ్యాధి రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. దాని భయంతో ప్రతి మనిషికి ఊపిరి ఆడటంలేదు. ఏమి చెయ్యాలో ఎవరికీ తోచటంలేదు. ప్రతి వ్యాధికి చికిత్సను ప్రసా దించిన దేవుడు దీనికి సరైన చికిత్స ప్రసాదించటం లేదెందుకు? అనే ప్రశ్న తలెత్తుతోంది. దానికి సమాధానంగా దేవుడు మనిషి పట్ల ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈ ఆపద మననుంచి తొలగిపోవాలంటే సృష్టికర్త కారుణ్యం వర్షించాలి అని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. అయితే దానికోసం ప్రతి ఒక్కరు ఆ సృష్టికర్త వైపునకు మరలటం ప్రారంభించాలి. ప్రతి మనిషి స్వభావం రీత్యా ఒకే ఒక్క దేవుణ్ని నమ్ముతాడు. కాని కొంతమంది ఒక్క దేవునితో పాటు మరికొన్ని సృష్టితాలను కూడా సృష్టికర్తతో సమానంగా నిలబెడతారు. కాని ఈ కరోనా వ్యాధి ప్రపంచం మొత్తం ఒకే రకంగా ప్రబలుతోంది. దాని లక్షణాలు కూడా ఒకేవిధంగా ఉంటున్నాయి. అయితే ఇది ఒకే ఒక్క దేవుని వైపు నుంచే వచ్చింది. అందరి సృష్టికర్త ఒక్కడే అనే విషయాన్ని కూడా స్పష్టపరుస్తోంది.

ఏదైనా ఆపదకు గురైన పిల్లవాడు తల్లి దగ్గరకు పరుగెట్టుకుని వెళ్ళి చీర కొంగు పట్టుకుని ఏడ్చినట్లుగా మనిషి తన ప్రభువు వైపునకు పరుగెట్టాలి. ఆయన శరణు పొందాలి. క్షమాభిక్ష పెట్టమని అర్థించాలి. తమ తప్పులను ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఇకపై అలా చేసేది లేదని, అన్యాయానికి, అక్రమానికి చోటివ్వ నని, మంచిని పెంచుతానని, చెడును త్రుంచుతానని, నీ ఆజ్ఞ లన్నీ శక్తికి మించి పాలిస్తానని వాగ్దానం చేసుకోవాలి. ఎందుకంటే ఖుర్ఆన్ గ్రంథంలో ఎన్నో జాతులను గురించి స్పష్టంగా వివ

రించి చెప్పబడింది. అన్యాయానికి, అక్రమానికి, దైవ ధిక్కారానికి పాల్పడిన ఎన్నో జాతులను మేము సమూలంగా తుడిచివేశాము. ఇంకా మా శిక్షను చూసి భయభ్రాంతులకు గురి అయి మా వైపునకు మరలి క్షమాభిక్ష కోరిన వారికి మేము క్షమించివేశాము. వారిపై వచ్చి పడిన శిక్షను తొలగించివేశాము. అంతేకాదు, వారికి సన్మార్గాన్ని ప్రసాదించాము. ఇహపర లోకాల సాఫల్యాన్ని ప్రసాదించాము. అలాంటి జాతుల చరిత్రలో హజ్రత్ యూనుస్(అ) గారి చరిత్ర స్పష్టంగా వివరించబడింది. దైవప్రవక్త హజ్రత్ యూనుస్(అ) వారి తప్పులను, పాపాలను సరిదిద్దటానికి ప్రయత్నించి విసిగి వేసారి అక్కడి నుంచి వెళ్ళిపోయినప్పుడు ఆకాశం శిక్షను మోసుకొచ్చింది. ఆ ఆకాశాన్ని చూసిన యూనుస్(అ) గారి జాతి ప్రజలు దైవాగ్రహాన్ని గుర్తించారు. భయభ్రాంతులకు గురయ్యారు. హజ్రత్ యూనుస్(అ)ను వెదకటం ప్రారంభించారు. ఆయన గారు వారికి కనిపించక పోయినప్పుడు వారందరూ ఒక మైదానంలో ఆకాశం క్రింద నిలబడి కన్నీళ్ళతో క్షమాభిక్ష పెట్టమని అర్థించారు. తప్పులను పాపాలను జ్ఞాపకం చేసుకుని పశ్చాత్తాపపడ్డారు. దైవప్రవక్తను ధిక్కరించినందుకు సిగ్గుతో కుమిలిపోయారు. వారి కళ్ళు ధారాపాతంగా ప్రవహించటం మొదలయ్యాయి. పశ్చాత్తాప పరితప్త హృదయంతో సాష్టాంగపడ్డారు. డెబ్బై తల్లుల ప్రేమ కలిగిన అల్లాహ్ అంటే అసంఖ్యాకమైన తల్లుల ప్రేమ కలిగిన కారుణ్య ప్రభువు కరుణ వర్షించింది. యూనుస్(అ) జాతి ప్రజలందరినీ తన కౌగిలిలో తీసుకుని రక్షించినట్లుగా దైవాజ్ఞతో ఆకాశం శిక్షను కురిపించటం మానివేసి కారుణ్యపు గాలులను వీయటం ప్రారంభించింది. సుఖ వాతావరణం ఏర్పడింది. ప్రజలు అల్లాహ్‌కు దగ్గరై పోయారు. అల్లాహ్ ప్రజలకు దగ్గరైపోయాడు. మార్గదర్శకత్వాన్ని ప్రసాదించాడు. మనిషికి ఇంతకంటే సౌభాగ్యమేముంటుంది.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; అల్లాహ్ గనక మీకు ఏదైనా నష్టం కలిగిస్తే, ఆయన తప్ప ఆ నష్టాన్నుండి మిమ్మల్ని రక్షించగలిగే వారెవరూ లేరు. ఆయన మీకు ఏదైనా మేలు కలుగజేస్తే, ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉంది. ఆయన తన దాసులపై సంపూర్ణమైన అధికారాలు కలిగిఉన్నాడు. ఇంకా అత్యంత వివేకవంతుడు, అన్నీ తెలిసినవాడు. (6:17,18) ప్రవక్తా(స)! వారిని ఇలా అడుగు; భూ సముద్రాలు చీకట్లలోని ప్రమాదాల నుండి మిమ్మల్ని కాపాడేది ఎవరు? మీరు ఆపద సమయంలో కడు దీనంగా విలపిస్తూ, అతి గోప్యంగా వేడుకునేది ఎవరిని? ఈ ఉపద్రవం నుండి ఆయన గనక మమ్మల్ని రక్షిస్తే, మేము తప్పకుండా కృతజ్ఞులు అవుతాము. అని మీరు అనేది ఎవరితో? ఇలా అను; అల్లాహ్ మీకు దాని నుండీ, ప్రతి బాధ నుండి విముక్తి కలిగిస్తాడు. తరువాత మీరు ఇతరులను ఆయనకు భాగస్వాములుగా నిలబెడతారు. ఇలా చెప్పు ఆయనకు ఈ శక్తి ఉంది. ఏదైనా శిక్షను పైనుండి మీపై అవతరింపజేయగలడు లేదా మీ పాదాల కింద నుండి తీసుకురాగలడు. (6: 63-65)

దైవప్రవక్త(స) ఒక సూక్తిలో ఇలా సెలవిచ్చారు; అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; నా గౌరవ మర్యాదల సాక్షిగా సెలవిస్తున్నాను. నా దాసుడెవడైనా నా నుండి శరణు కోరినట్లయితే ఒకవేళ భూమ్యాకాశాలన్నీ అతనికి వ్యతిరేకులైపోయినా నేను అతనికి విముక్తిని విశాలత్వాన్ని ప్రసాదిస్తాను. నా గౌరవ మర్యాదల సాక్షిగా! ఒకవేళ ఎవరైనా నన్ను కాదని ఇతరుల శరణు కోరినట్ల యితే నేను అతని పాదాల నుంచి భూమిని లాగివేస్తాను.

దీనిద్వారా తెలిసిన విషయమేమిటంటే, సకల శక్తిసామర్థ్యాలు సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌ను మాత్రమే విశ్వసించాలి. విశ్వాసంలో పటిష్టతను ఏర్పరచుకోవాలి. సంతోషంలోను, దుఃఖంలోను ఆయన వైపునకే మరలాలి. ఆయననే శరణు వేడుకోవాలి. సహాయాన్ని అర్థించాలి. ఆయన తప్పకుండా సహాయపడతాడు. కష్టాల కడలిలోనుంచి బయటికి తీస్తాడు. కనుక మనిషి తన తప్పులను గ్రహించాలి. గడిచిన జీవితాన్ని విశ్లేషించుకోవాలి. దైవాగ్రహానికి గురిచేసిన ఆచరణలను గుర్తించి క్షమాభిక్ష పెట్టమని కన్నీళ్ళతో అర్థించాలి. ఎందుకంటే క్షమాభిక్ష పెట్టడానికి అల్లాహ్ ఎంతో ఇష్టపడతాడు. పాపకార్యాలు చేసి తన ఆగ్రహానికి గురై దూరంగా వెళ్ళిపోయిన తన భక్తుడు తిరిగి తన వద్దకు చేరితే అమితానందంతో తన కారుణ్య ఛాయలతో అతనిని తీసుకుంటాడు. అతనినిప్రేమిస్తాడు, అతనిని తన వాడుగా చేసుకుంటాడు. కనుకనే ఖుర్ఆన్ గ్రంథంలో పాప కార్యాలు చేసి తమ ప్రాణాలపై దౌర్జన్యం చేసుకున్న ప్రజలు నిరాశ నిస్పృహలకు గురికావద్దని, దైవ కారుణ్యం అత్యంత విశాలమైనదని బోధించడం జరిగింది.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## 31వ పేజీ తరువాయి...

ప్రయోగించిన అణ్వాయుధాలు చేసిన విధ్వంసం సాక్షిగా ఉంది. ఈ అణుబాంబు శక్తిని ఒక్కసారి అంచనా వేస్తే దాని సామర్థ్యం ఎంతో తెలుస్తుంది. ఒక మెగావాట్ అణుబాంబు 10లక్షల టి.ఎన్.టి విడుదల చేసే విధ్వంసశక్తితో సమానం. 1 పౌను టి.ఎన్.టి పేల్చినట్లయితే 10 టన్నుల బరువు గల వస్తువు పది గజాల ఎత్తుకు ఎగిరిపోతుంది.

భయంకరమైన విస్ఫోటనం కలిగించే అణు బాంబు తయారీలో రేడియం పదార్థాన్ని ఉపయోగిస్తారు. రేడియం, యురేనియం, థోరియం మొదలైన లోహాలు నిరంతరం వెలుగును ప్రసరిస్తూ ఉంటాయి. సుమారు రెండు పౌనుల బరువు గల రేడియం ఉన్న గదిలోకి వెళ్ళడమంటే మృత్యువు నోట్లో తలపెట్టినట్లే. ఒక పౌను యురేనియంలోని పరమాణు శక్తితో ఒక విమానాన్ని భూగోళం చుట్టూ 3000 సార్లు త్రిప్పవచ్చు. ఇంత ప్రఛండమైన శక్తి గల యురేనియం కంటే 20లక్షల రెట్లు శక్తిమంతైనదీ రేడియం పదార్థం. ఇటువంటి ప్రచండమైన శక్తి గల రేడియం పదార్థాన్ని అణుబాంబులో ఉపయోగిస్తారు. దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. మన నాశనానికి మనం ఎంత కట్టుదిట్టం చేసుకుంటున్నామో!

ఈ భయంకరమైన అణుబాంబును 2వ ప్రపంచ యుద్ధం దాదాపుగా ముగిసిన సమయంలో 1945 ఆగస్టు 6న ఉదయం 8.15 గంటకు అమెరికా హిరోషిమా నగరంపై తొలిసారిగా ప్రయోగించింది. తిరిగి మరల ఆగస్టు 9 తారీఖున నాగసాకి నగరంపై రెండవ అణుబాంబును ప్రయోగించింది. ఈ ఘోర విదారక విధ్వంసం ఫలితంగా హిరోషిమాలో మరణించిన వారి సంఖ్య 78,150 మంది. కనిపించకుండా పోయిన వారి సంఖ్య 13,983 మంది. క్షతగాత్రులైన వారు 37,423, వ్యాధులు తదితర బాధలకు గురైనవారు 2,35,656. నాగసాకితో మరణించిన వారు 23,753, కనిపించకుండా పోయినవారు 1,924 మంది, క్షత గాత్రులైనవారు 23,324 వ్యాధులకు గురైన వారు 89,025. ఈ విధ్వంసం జరిగి 43 సంవత్సరాలు దాదాపు గడిచినప్పటికి ఆ అణుబాంబు ప్రభావం వలన ఉత్పన్నమయిన రకరకాల రేడియేషన్ వ్యాధుల వలన క్యాన్సర్ వంటి వ్యాధి వలన నేటికి వేలాది మంది హాస్పిటల్‌లలో బాధపడుతున్నారు. ఏటా సుమారు 2,500 మంది ఈ కారణాల వల్ల దుర్మరణం పాలవుతున్నారు. హిరోషిమా లోని 'జపాన్ రెడ్‌క్రాస్ ఆటమిక్ బాంబు హాస్పిటల్‌లో నేటికినీ నాటి రోగులు చికిత్స పొందుతున్నారు. హిరోషిమా నగరంపై అణుబాంబు ప్రయోగానికి నియమించబడ్డ ఇద్దరు సైనికులు ఆ ఘోర విధ్వంసకాండను చూసి చలించిపోయి హా భగవంతుడా! మేమింత ఘోర తప్పిదం చేశామా! అని ఆక్రోశించారట. ఆ ఇద్దరు సైనికులలో ఒకడైన బెషర్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి బెషర్ రక్షణ నిలయాల పేరుతో అనాధ శరణాలయాలు స్థాపిస్తూ సన్యాసం స్వీకరించి తన జీవిత శేషాన్ని గడిపాడు. రాబర్ట్ వెతి అనే రెండో విమాన పైలట్ అణ్వాయుధాలను నిషేధించాలని కోరుతూ శాంతి యోధుడయ్యాడు.

ప్రపంచ యుద్ధాల తర్వాత అనేక యుద్ధాలు జరిగాయి. ఇరాక్, అఫ్ఘనిస్తాన్ దేశాలను కుంటి సాకులతో అమెరికా నాశనం చేసింది. రెండు గల్ఫ్ యుద్ధాలు జరిగాయి. ఇప్పుడు గాజాలో మారణ హోమం జరుగుతోంది.

యుద్ధం అనేది సమస్యను జఠిలం చేస్తుందే గాని పరిష్కార మార్గం ఎన్నటికీ కాదు. యుద్ధంలో ఒక పక్షం నెగ్గినట్లయితే అది దాని అంగబలం. అది సమస్యకు పరిష్కారం మాత్రం కాదు.


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**